

ఓపెన్ స్కూల్ పరీక్షల దందా!

నగదు చెల్లిస్తే పాస్ గ్యారంటీ అంటూ ప్రైవేటు స్కూల్, ట్యుటోరియల్స్ భరోసా

ఒక్కో సబ్జెక్టుకు రూ.2 వేల వరకు వసూలు!

- ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షల నిర్వహణలో అమలు
- ఇన్విజలేటర్లు, పరీక్షా కేంద్రాలు ప్రత్యేకంగా ఎంపిక
- జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి కనుసన్నల్లో ఈ తతంగం!



జిల్లాలో ఓపెన్ స్కూల్ పరీక్షల దందా నడుస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. నగదు చెల్లిస్తే పాస్ గ్యారంటీ అంటూ ప్రైవేటు స్కూల్, ట్యుటోరియల్స్ యజమానులు భరోసా ఇస్తున్నట్లు సమాచారం. ఒక్కో సబ్జెక్టుకు రూ.2 వేల వరకు వసూలు చేసి మరీ ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షల నిర్వహణలో అమలు చేస్తున్నట్లు తెలిసింది. పరీక్ష కేంద్రాల ఎంపిక, ఇన్విజలేటర్ల నియామకంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న ఓ ఉద్యోగి చక్రం తిప్పినట్లు సమాచారం. ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షా పత్రాలను ముందుగానే బయటకు తెచ్చి, వాటికి జవాబులు రాసి విద్యార్థులకు అందజేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో ఇంటర్మీడియట్ రెగ్యులర్ పరీక్షలతోపాటు ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షలు ఈ నెలలో జరిగాయి. ప్రస్తుతం ఈ నెల 17వ తేదీ నుంచి పదో తరగతి రెగ్యులర్ పరీక్షలతోపాటు ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇంటర్మీడియట్ బోర్డు వారు ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించలేమని చెప్పడంతో జిల్లా విద్యాశాఖ అధికారులకే ఈ బాధ్యతలను అప్పగించారు. ఇంటర్మీడియట్, పదో తరగతి రెగ్యులర్ విద్యార్థులకు కేటాయించిన పరీక్షా కేంద్రాల్లో మరో రెండు గదులను అదనంగా కేటాయించి అక్కడ ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్ పరీక్షలకు జిల్లా నుంచి 2,341 మందికి గాను 11 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసి పరీక్షలు పూర్తి చేశారు. జిల్లాలో పదో తరగతి ఓపెన్ స్కూల్స్ పరీక్షలకు వెయ్యి మందికిపైగా విద్యార్థులు హాజరవుతున్నారు. వీరి కోసం 23 పరీక్షా కేంద్రాలను జిల్లాలోని వివిధ పాఠశాలల్లో ప్రస్తుతం ఏర్పాటు చేశారు.

పాస్ గ్యారంటీ అని చెప్పి..

ఓపెన్ స్కూల్ పరీక్షలకు సంబంధించి జిల్లాలోని వివిధ ప్రైవేటు స్కూల్, ట్యుటోరియల్స్ నడిపేవారు ముందస్తుగానే గ్యారంటీ పాస్ పేరుతో నగదు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ విభాగాల్లో వివిధ స్థాయిల్లో ఉద్యోగాలు చేస్తూ పదోన్నతుల కోసం కొంత మంది, వివిధ అవసరాల నిమిత్తం మరికొంతమంది, సర్టిఫికెట్ల కోసం ఇంకొంతమంది ఇంటర్మీడియట్, పదో తరగతులను ఓపెన్ స్కూల్ ద్వారా పూర్తి చేసేందుకు ముందుకు వస్తున్నారు. వీరికి సబ్జెక్టుకు ఇంత, పరీక్ష ఫీజు ఇంత అని ముందుగానే చెప్పి ఒక్కో సబ్జెక్టుకు కనీసంగా రెండు వేల రూపాయలు చొప్పున వసూలు చేస్తున్నట్లు తెలిసింది. పరీక్షలు సక్రమంగా రాయకున్నా జవాబు పత్రాలను మూల్యాంకనం చేసే సమయంలోనైనా తమదైన శైలిలో పాస్ చేయిస్తామని నమ్మబలికి నగదు వసూలు చేయడం ఏటా ఆనవాయితీగా వస్తోంది.

చక్రం తిప్పుతున్న విద్యాశాఖ కార్యాలయంలోని కాంట్రాక్టు ఉద్యోగి

జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న ఉద్యోగి కనుసన్నల్లో పదో తరగతి ఓపెన్ స్కూల్స్ పరీక్షల నిర్వహణకు సంబంధించి పరీక్షా కేంద్రాల ఏర్పాటు, ఇన్విజలేటర్ల నియామకం జరుగుతున్నట్లు సమాచారం. ప్రైవేటు స్కూల్స్ యజమానులకు, విద్యాశాఖ కార్యాలయంలో పనిచేసే అధికారులకు మధ్య ఉన్న సత్సంబంధాల కారణంగా ఈ వ్యవహారం గుట్టు చప్పుడుకాకుండా సాగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెగ్యులర్ పరీక్షల మాదిరిగా, ఓపెన్ స్కూల్ పరీక్షలను అధికారులు అంతగా పట్టించుకోకపోవడంతో ఓపెన్ స్కూల్ పరీక్షల నిర్వహణ ప్రైవేటు వ్యక్తుల కనుసన్నల్లోనే నడుస్తోంది. పరీక్షా పత్రాలను బయటకుతెచ్చి త్వరితగతిన వాటికి జవాబులు రాసి, తిరిగి ఓపెన్‌స్కూల్ పదోతరగతి పరీక్షా కేంద్రాలకు గుట్టుచప్పుడు కాకుండా చేరవేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసం పరీక్షా కేంద్రాలు ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేకంగా కొందరిని ఏర్పాటు చేసుకుని తమ పనిని పూర్తి చేస్తుండటం గమనించదగ్గ అంశం. ఈ అంశంపై విద్యాశాఖ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ డేవిడ్‌రాజును వివరణ కోరగా గతంలో ఏవైనా తప్పులు జరిగితే జరిగి ఉండవచ్చని, కృష్ణాజిల్లాలో ఇంటర్మీడియట్, పదోతరగతి ఓపెన్‌స్కూల్స్ పరీక్షలలో ఎలాంటి మాస్‌కాపీయింగ్ జరగడానికి అవకాశమే లేదని చెప్పారు.

బెజవాడ ఆటోనగర్‌కు కష్టమొచ్చింది!

తీవ్రంగా వేధిస్తున్న టెక్నీషియన్స్ కొరత

20 వేల మంది నుంచి 1700 తగ్గిన సంఖ్య

- మెకానిక్ మేస్త్రీలు, సీనియర్ మెకానిక్‌లు, హెల్పర్లు లేక ఖాళీగా యూనిట్లు
- ఆగిపోయిన ఇతర జిల్లాల నుంచి వచ్చే లారీలు
- కేవలం ఉమ్మడి కృష్ణాజిల్లాకే సేవలు పరిమితం
- ఉన్న వారిని కాపాడుకునే పనిలో ఆటోనగర్ టెక్నీషియన్స్ అసోసియేషన్



ఆసియాలోనే రెండో అతిపెద్ద ఆటోనగర్‌గా ప్రసిద్ధి చెందిన విజయవాడ జవహర్ ఆటోనగర్ నేడు టెక్నీషియన్స్ సమస్యతో సతమతమవుతోంది. 20 వేల మంది మెకానిక్ మేస్త్రీలు, సీనియర్ మెకానిక్‌లు, హెల్పర్లతో కోలాహంగా ఉండే యూనిట్లు 1700 మందితో అతికష్టంపై నెట్టుకొస్తున్నాయి. మారుతున్న ఆటోమొబైల్ రంగానికి అనుగుణంగా కొత్తతరం రాక నిలిచిపోవడంతో రోజురోజుకు సేవలు తగ్గిపోతున్నాయి. ప్రస్తుతం ఉమ్మడి కృష్ణాజిల్లాకే ఆటోనగర్ సేవలు పరిమితమయ్యాయి. పూర్వపు రోజుల్లో ఉన్న టెక్నీషియన్లలో ప్రస్తుతం కేవలం 18 శాతం లోపు మాత్రమే ఉన్నారు. దాదాపుగా 82 శాతం మంది టెక్నీషియన్ల కొరతను జవహర్ ఆటోనగర్ ఎదుర్కొంటోంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రాష్ట్ర వ్యాప్తంగా అనేక దశాబ్దాల పాటు విస్తృతంగా సేవలందించిన విజయవాడ జవహర్ ఆటోనగర్ నేడు టెక్నీషియన్ల కొరతను తీవ్రంగా ఎదుర్కొంటోంది. ఇక్కడ పనిచేసే టెక్నీషియన్లలో ప్రధానంగా మెకానిక్ మేస్త్రీలు, సీనియర్ మెకానిక్‌లు ఉంటారు. ఆ తర్వాత హెల్పర్లు. పూర్వపు రోజుల్లో టెక్నీషియన్స్ కేటగిరిలో 20 వేల మంది వర్కర్లు, హెల్పర్లు ఉండేవారు. ఇందులో రెండు వేల మంది మెకానిక్ మేస్త్రీలు, సీనియర్ మెకానిక్‌లు ఉండేవారు. హెల్పర్లు 18 వేల మంది వరకు ఉండేవారు. ప్రస్తుతం అందరూ కలిపి 1700 మంది మాత్రమే ఉన్నారు. దీనిని బట్టి జవహర్ ఆటోనగర్‌కు ఏ స్థాయిలో టెక్నీషియన్స్ కొరత ఏర్పడిందో అర్థం చేసుకోవచ్చు. ఆటోనగర్ టెక్నీషియన్స్ అసోసియేషన్ (ఏటీఏ) కూడా ఈ కొరతను అధిగమించటానికి ఏమీ చేయలేకపోతోంది. ఉన్న వాళ్ల మిగతా 6లో..

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 06-22 (బుధవారం సాయంత్రం)

సహర్ : 04-53 (గురువారం ఉదయం)

ఆశలు ఆవిరి!

గత ఏడాది కంటే రూ.1500 నుంచి రూ. 2 వేలు తగ్గిన మినుము ధర

- గిట్టుబాటు కాని ధరతో నష్టపోతున్న మినుము రైతులు
- పెట్టుబడి ఖర్చులు కూడా రావడం లేదని పలువురి ఆవేదన
- తీవ్రంగా నష్టపోతున్న కౌలురైతులు



6లో



పరిశ్రమల స్థాపనకు తక్షణమే అనుమతులు

- కలెక్టర్ బాలాజీ

8లో

సంస్థ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి

8లో

- ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు

23, 24, 25న పలు రైళ్లు రద్దు



- విజయవాడ డివిజన్ పీఆర్‌వో నుస్రత్ ఎం మండ్రూపకర్

8లో

వెస్ట్ బైపాస్ అత్యవసరం!

నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు అత్యవసరంగా వెస్ట్ బైపాస్‌ను అందుబాటులోకి తీసుకురావడమే పరిష్కార మార్గమని ప్రజలు భావిస్తున్నారు. 95 శాతం పనులు పూర్తి చేసుకున్న రోడ్డు నెలల తరబడి అందుబాటులోకి రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఐదు శాతం పనుల్లో ఏర్పడిన ల్యాంకో, అలైన్‌మెంట్ వివాదాలపై ప్రభుత్వం వెంటనే దృష్టి సారించి, మిగిలిన పనులు పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

95 శాతం పనులు పూర్తి

నేటికీ వినియోగంలోకి రాని రోడ్డు

- నగరంపై రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ భారం
- ల్యాంకో, అలైన్‌మెంట్ వివాదాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి
- త్వరితగతిన అందుబాటులోకి తెచ్చి ట్రాఫిక్ కష్టాలు తీర్చాలని ప్రజల డిమాండ్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డు దాదాపుగా 95శాతం పూర్తయినా అందుబాటులోకి రాకపోవటం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా ట్రాన్స్‌మిషన్ హైటెన్షన్ విద్యుత్ లైన్లకు సంబంధించి పీజీసీఎల్ఐ, రైతులు, ఎన్‌హెచ్‌ల మధ్య నెలకొన్న వివాదం అపరిష్కృతంగా ఉండటం వల్ల తీవ్ర జాప్యం జరుగుతోంది. విజయవాడ వెస్ట్ బైపాస్ జాప్యంలో ఏ శాఖకూ పెద్దగా నష్టం జరగటం లేదు. ఎందుకంటే కాంట్రాక్టు సంస్థకు యాన్యుటీ చెల్లిస్తున్నారు. విద్యుత్ సంస్థలకు వచ్చిన నష్టం ఏమీ లేదు. ఎన్‌హెచ్‌కు వచ్చిన నష్టం కూడా ఏమీ లేదు. ఎటొచ్చీ దీని వల్ల నష్టపోతున్నది రాష్ట్ర ప్రభుత్వమే. ఎందుకంటే.. ఈ రోడ్డు విజయవాడ, గుంటూరు జిల్లా ప్రజలకే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల వారికి కూడా ఉపయోగపడుతుంది. ప్రజలకు అందుబాటులోకి రాకపోవటం వల్ల నష్టపోతున్నది రాష్ట్ర ప్రభుత్వమే కాబట్టి.. ఈ ప్రాజెక్టు వివాదాన్ని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కూడా రాష్ట్ర ప్రభుత్వం పైనే ఎక్కువగా ఉంది.

ప్రధాన సమస్యగా విద్యుత్ హైటెన్షన్ల అంశం

విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డు పూర్తి కావటంలో ఉన్న ప్రధానమైన సమస్య విద్యుత్ హైటెన్షన్ లైన్. ల్యాంకోకు చెందిన ట్రాన్స్‌మిషన్ హైటెన్షన్ విద్యుత్ లైన్ల అంశం న్యాయస్థానం పరిధిలో ఉంది. రైతులు వేసిన పిటిషన్ల నేపథ్యంలో న్యాయస్థానం స్టే విధించింది. రైతులు, పీజీసీఎల్ఐ, ఎన్‌హెచ్‌ల మధ్య నెలకొన్న



95 శాతం పైన పూర్తయిన వెస్ట్ బైపాస్

ముక్కోణపు వివాద పరిష్కారానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రాథమికంగా జోక్యం చేసుకుని దానిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టింది. రైతులు, ఎన్‌హెచ్ అధికారుల మధ్యన నెలకొన్న వివాదాన్ని రాష్ట్ర ప్రభుత్వం చాలా వరకు పరిష్కరించగలిగినా.. రైతులు, పీజీసీఐఎల్‌ల మధ్యన నెలకొన్న సమస్య మాత్రం పరిష్కారం కావటం లేదు. ఎందుకంటే మూలన పడిన ల్యాంకో విద్యుత్ ప్రాజెక్టుకు సంబంధించిన ట్రాన్స్‌మిషన్ లైన్ అలైన్‌మెంట్‌ను మార్చటం వివాదానికి కేంద్ర బిందువు అయింది. మూలన పడిన విద్యుత్ ప్లాంట్‌కు సంబంధించిన లైన్‌కు విద్యుదుత్పత్తి జరగకపోయినా అంతరాయం పేరుతో డబ్బులు చెల్లించటం, అలైన్‌మెంట్ మార్పుకు బలవంతంగా పట్టుబట్టడం వంటి మిగతా 6లో..

నేడు తాడేపల్లికి పంచాయితీ!

తిరువూరు వైసీపీ కౌన్సిలర్ల మధ్య విభేదాలు

- ప్రస్తుత చైర్‌పర్సన్ తప్పుకుని మరొకరికి అవకాశం ఇవ్వాలని పట్టు
- చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ కలెక్టర్‌కు వినతి
- అసమ్మతి సభ్యులను బుజ్జగించేందుకు జగన్ వద్దకు తీసుకెళ్లనున్న స్థానిక నేతలు

తిరువూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): తిరువూరు మున్సిపాల్టీ వైసీపీ పాలకవర్గంలో ఏర్పడిన విభేదాలు తారాస్థాయికి చేరాయి. అసమ్మతి కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ కలెక్టర్‌కు నోటీసులు ఇచ్చారు. వీరిని బుజ్జగించేందుకు స్థానిక వైసీపీ నేతలు వీరిని తాడేపల్లి ప్యాలెస్‌లోని అధినేత వద్దకు బుధవారం తీసుకెళ్లనున్నట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే... స్థానిక మున్సిపాల్టీలో వైసీపీ కౌన్సిలర్ల మధ్య కొంతకాలంగా ఆధిపత్య పోరు నడుస్తోంది. గతంలో అనుకున్న ప్రకారం ప్రస్తుత చైర్‌పర్సన్ రాజీనామా చెయ్యాలని, తదుపరి మోదుగు ప్రసాద్‌కు అవకాశం ఇవ్వాలనే డిమాండ్‌తో కొందరు వైసీపీ కౌన్సిలర్లు అవిశ్వాసం బాటపట్టారు. ఈ నెల 13న కలెక్టర్ లక్ష్మీశ, ఆర్డీవో కె.మాధురి, మున్సిపల్ కమిషనర్ లోవ రాజును కలిసి ప్రస్తుత చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ వినతి పత్రాలు అందించారు. వీరిని బుజ్జగించి తిరిగి వైసీపీ కౌన్సిలర్లను ఒకే తాటిపైకి తీసుకువచ్చేందుకు స్థానిక నేతలు ప్రయత్నిస్తున్నారు. చివరగా తాడేపల్లికి ఈ కౌన్సిలర్లను తీసుకువెళ్లి సర్దిచెప్పే ప్రయత్నం చేయనున్నారు. ప్రస్తుతం అవిశ్వాసం ప్రకటించిన కౌన్సిలర్లలో కొందరు తాడేపల్లి వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. తాము పార్టీ అధినేతను చూసేందుకే వెళ్తున్నామని, అవిశ్వాసంపై వెనక్కి తగ్గేది లేదంటున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపాల్టీలో ఎటువంటి పరిస్థితులు నెలకొంటాయోనని పట్టణ ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో మంగళవారం ప్రారంభమైన ప్రజాప్రతినిధుల క్రీడా పోటీలు ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రజాసమస్యలపై గళాన్ని వినిపించిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు క్రీడల్లో లక్ష్యాలపై గురిపెట్టారు. క్రికెట్, టగ్ ఆఫ్ వార్, టెన్నిస్, త్రోబాల్ తదితర పోటీల్లో నువ్వానేనా అన్నట్లు సర్వశక్తులను ఒడ్డారు. ఆద్యంతం సందడిగా గడిపారు.



బ్యాటింగ్ చేస్తున్న ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు (ఇన్‌సెట్‌లో) బౌలింగ్ చేస్తున్న పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ప్రజాప్రతినిధుల క్రీడా పోటీలు ప్రారంభం

క్రికెట్‌లో టాస్ గెలిచిన అచ్చెన్న... మ్యాచ్ గెలిచిన నాదెండ్ల

టగ్ ఆఫ్ వార్‌లో మహిళా ఎమ్మెల్యేల పైచేయి ● వ్యాఖ్యాతగా సుధీర్‌రెడ్డి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ప్రజాప్రతినిధుల క్రీడా పోటీలను శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు మంగళవారం ప్రారంభించారు. తొలుతగా టగ్ ఆఫ్ వార్ నిర్వహించారు. కోస్తాంధ్ర మహిళా ఎమ్మెల్యేలు ఒక జట్టుగా, రాయలసీమ మహిళా ఎమ్మెల్యేలు మరో జట్టుగా ఏర్పడ్డారు. ఇందులో రాయలసీమ జట్టు విజయం సాధించింది. అనంతరం పురుషుల విభాగంలో టగ్ ఆఫ్ వార్ నిర్వహించారు. ఇందులో రాయలసీమ ఎమ్మెల్యేలు ఒక జట్టుగా, కోస్తాంధ్ర ఎమ్మెల్యేలు మరో జట్టుగా ఉన్నారు. ఈ విభాగంలో మంత్రి అచ్చెన్నాయుడు రాయలసీమ జట్టులో ఉన్నారు. ఈ విభాగంలో కోస్తాంధ్ర జట్టు విజయం సాధించింది. అనంతరం జరిగిన క్రికెట్ పోటీల్లో మంత్రి అచ్చెన్నాయుడు ఒక జట్టుగా, మరో మంత్రి నాదెండ్ల మనోహర్ ఇంకో జట్టుగా పిచ్‌లోకి దిగారు. అచ్చెన్నాయుడు టాస్ గెలిచి మిగతా 6లో..



టగ్ ఆఫ్ వార్‌లో మహిళా ఎమ్మెల్యేలు

పోటీల్లో పాల్గొన్న వైసీపీ ఎమ్మెల్సీలు

ప్రజాప్రతినిధుల క్రీడా పోటీలకు వైసీపీ ఎమ్మెల్యేలు దూరంగా ఉన్నప్పటికీ ఎమ్మెల్సీలు మాత్రం హాజరయ్యారు. కల్యాణ చక్రవర్తి, ఏసురత్నం, సీహెచ్ అనంత ఉదయ్ భాస్కర్, రవీంద్రనాథ్ ఈ పోటీల్లో పాల్గొన్నారు. క్రీడా ప్రాంగణంలో కూటమి ఎమ్మెల్యేలతో కలిసి సందడిగా గడిపారు.



కొండపల్లి-ఈలప్రోలు గ్రామాల మధ్య దారిలో ఉన్న రైల్వే గేటు

ఇంకెన్నాళ్లు!

- గేటు పండిందా.. పనులు గోవిందా!
- లెవల్ క్రాసింగ్ రైల్వే గేట్ల వద్ద ప్రజల కష్టాలు
- ఆర్వోబీల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూపులు
- రైల్వే జీఎంతో ఎమ్మెల్యే వసంత చర్చలు
- నేటికీ కార్యరూపం దాల్చని వైనం



రాయనపాడు వద్ద గేటు వేయటంతో వేచి ఉన్న వాహనాలు

● శ్రీనివాసరావు ప్రైవేటు సంస్థలో ఉద్యోగి. ఉదయం పని ఒత్తిడి వల్ల ఆరోజు కాస్త ఆలస్యమైంది. ఎలాగైనా టైంకి ఆఫీసుకు చేరుకోవాలని ఇంటి నుంచి హడావిడిగా ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. అప్పటి వరకు ప్రయాణం సాఫీగా సాగినా.. లెవెల్ క్రాసింగ్ వద్ద బ్రేకులు పడ్డాయి. రైల్వే గేటు పడింది. అయ్యో సమయం అయిపోతోంది.. ఈ గేటు ఇప్పుడే పడాలా..! రైలు వచ్చేనా.. గేటు తెరిచేనా.. అంటూ నిట్టూర్చాడు.

● రోజూ ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు, రైతులు, ప్రయాణికులు లెవల్ క్రాసింగ్ గేట్ల వద్ద ఆగాల్సిందే.. ఒక్కసారి గేటు పండిందా.. ఇక అంతే సంగతి. రైలు లెవల్ క్రాసింగ్ దాటే వరకు గేట్లు తెరుచుకోవు. అంతవరకూ నిరీక్షణ తప్పదు. ఈ కష్టాలు ఎప్పటికి తీరుతాయో అంటూ స్థానిక ప్రజలు ఆశగా చూస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం)

విజయవాడ-సికింద్రాబాద్ రూట్ మైలవరం నియోజకవర్గంలో పలు లెవల్ క్రాసింగ్‌ల వద్ద రైల్వే గేటు కష్టాలు ప్రయాణికులు, వాహన చోదకులను ముప్పతిప్పలు పెడుతున్నాయి. ముఖ్యంగా కొండపల్లి, రాయనపాడు, గుంటుపల్లి గ్రామాల్లో రైల్వే గేట్ల వద్ద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక సారి గేటు పడితే అర్ధగంట సమయం వృథా అవుతుంది. దీంతో విజయవాడలో అత్యవసర పనులు, ఉద్యోగాల నిమిత్తం వెళ్లే వారికి తిప్పలు తప్పడం లేదు. మరోవైపు జి.కొండూరు మండలంలోని చెర్వుమాధవరం, గంగినేనిపాలెం, దుగ్గిరాలపాడు తదితరగ్రామాల్లో రైల్వేగేట్ల వద్ద రైతులు అవస్థలు పడుతున్నారు. రైలుపట్టాలు దాటి పొలాల్లోకి రాకపోకలు సాగించేందుకు అష్టకష్టాలు పడాల్సి వస్తున్నది. ప్రధానంగా ఆరుచోట్ల రోడ్డు ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని మైలవరం, విజయాడ రూరల్, ఇబ్రహీంపట్నం, జి.కొండూరు మండలాల ప్రజలు వాపోతున్నారు.

ఎమ్మెల్యే కృషి ఫలించేనా..

ఈఏడాది జనవరి 29న జిల్లా కలెక్టరేట్‌లో రైల్వే జీఎంతో జరిపిన సమావేశంలో మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కొండపల్లి లెవల్ క్రాసింగ్ (ఎల్‌సి) 140, ఈలప్రోలు ఎల్‌సీ 147, రాయనపాడు ఎల్‌సీ 148, గొల్లపూడి ఎల్‌సీ నంబరు 150 వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జ్ (ఆర్‌ఓబీ)లు నిర్మాణం చేపట్టాలని కోరారు. బ్రిడ్జిల ఆవశ్యకతను ఆయన జీఎం దృష్టికి తీసుకెళ్లారు. అయినా నేటికి కార్యరూపం దాల్చలేదు.

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం

- నూతక్కి నాగేశ్వరరావు, రైతు



చెర్వుమాధవరం రైల్వే గేటు దాటి పొలాల్లోకి వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడాలి వస్తున్నది. పొలానికి వెళ్లి రావాలంటే గేటు వద్దే సమయం గడిచిపోతోంది. వంతెన నిర్మాణం ఎంత త్వరగా చేపడితే మా బాధలు తీర్చిన వారవుతారు. ఏళ్ల తరబడి మాసమస్యలు పట్టించుకునే వారు లేకుండా పోయారు.

ఫ్లైఓవర్ ఏర్పాటు చేస్తే మంచిది

- జాస్తి గోపాలకృష్ణ, గుంటుపల్లి



గుంటుపల్లి వద్ద ఫ్లై ఓవర్ ఏర్పాటు చేస్తే మంచిది. వ్యాగన్ వర్క్‌షాపు వద్ద సబ్ వే ఉండాలి. రైతులు, వ్యవసాయ కార్మికులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. గుంటుపల్లి వ్యాగన్ వర్క్‌షాపులో ఉద్యోగస్తులు డ్యూటీలకు వచ్చేందుకు వంతెన లేకపోవడం చాలా ఇబ్బందిగా ఉంటోంది.

అసెంబ్లీ వేదికగా

వరదల ముంపు నివారణకు శాశ్వత చర్యలు చేపట్టండి

» ఎమ్మెల్యే సుజనా చౌదరి



వన్‌టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల సంభవించిన బుడమేరు వరదలకు ప్రాణనష్టంతో పాటు భారీగా ఆస్తి నష్టం వాటిల్లిందని, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా విజయవాడ నగరాన్ని రక్షించాలని, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ (సుజనా చౌదరి) అన్నారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ, బుడమేరు వరద ముంపు నివారణ, నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ప్రశ్నించారు. బుడమేరుతో పాటు రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలకు శ్రీకాకుళం, విజయనగరం, ఈస్ట్ గోదావరి, వెస్ట్ గోదావరి, కృష్ణా, గుంటూరు వరద ప్రభావిత ప్రాంతాల్లో నష్టాలు సంభవించకుండా చర్యలు చేపట్టాలన్నారు. భవిష్యత్తులో తుఫానులు, వరదల వలన ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. పశ్చిమ నియోజకవర్గంలో స్ట్రామ్ వాటర్ డ్రెయినేజీల, అవుట్ ఫాల్ డ్రెయిన్‌ల నిర్వహణ సరిగా లేదన్నారు.

ఇస్కాన్ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

ఉండవల్లి కరకట్ట రోడ్డులోని ఇస్కాన్ మందిరాన్ని ఎమ్మెల్యే సుజనా చౌదరి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో కలిసి మంగళవారం సందర్శించారు. మందిర అధ్యక్షులు చక్రధరి దాస్ శ్రీకృష్ణుని జీవిత చరిత్రను తెలియజేసే కృష్ణ ఆర్ట్ పుస్తకాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు.

బుడమేరు సమగ్రాభివృద్ధికి నిధులివ్వాలి

» ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్



ఇబ్రహీంపట్నం : బుడమేరును అభివృద్ధి చేసేందుకు, గతేడాది ఆకస్మిక వరదల వల్ల నియోజకవర్గంలో చెరువులు, వాగులకు పడిన గండ్ల మరమ్మతులకు, ఎన్‌ఎస్‌పీ కాలువ అభివృద్ధికి నిధులు కేటాయించాలని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ కోరారు. వరదలకు నియోజకవర్గం పూర్తిగా దెబ్బతిందన్నారు. బుడమేరు వాగులు పొంగి 50పైగా చెరువుల కట్టలు దెబ్బతిన్నాయన్నారు. బుడమేరు 70శాతం పైగా మైలవరం నియోజకవర్గంలోనే ఉందన్నారు. భవిష్యత్‌లో ఎలాంటి విపత్తులు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టేందుకు అవసమరైన నిధులు కేటాయించాలని కోరారు.

తిరువూరులో సబ్‌కోర్టు ఏర్పాటు చేయాలి

» ఎమ్మెల్యే కొలికపూడి



తిరువూరు : డివిజన్ కేంద్రమైన తిరువూరులో సబ్‌కోర్టు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సబ్‌కోర్టు అవసరాల కోసం వ్యయప్రయాసలకోర్చి నూజివీడు వెళ్లాల్సి వస్తున్నదని ప్రజల ఇబ్బందులను ఆయన సభదృష్టికి తెచ్చారు. నూజివీడు ఏలూరు జిల్లాలోకి వెళ్లడంతో సాంకేతికరపరమైన ఇబ్బందులు వస్తున్నాయన్నారు. తిరువూరులో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, అడిషనల్ డిస్ట్రిక్ట్ కోర్టులు ఏర్పాటుచేయాలని ఆయన న్యాయశాఖమంత్రిని కోరడంతో పాటు, ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు.

అవుట్‌ఫాల్ స్లూయిస్‌లు పునర్నిర్మించండి

» ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



అవనిగడ్డ : నియోజకవర్గంలో అవుట్ ఫాల్ స్లూయిస్‌లను పునర్నిర్మించి అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గడచిన ఐదేళ్లలో అవుట్‌ఫాల్ స్లూయిస్‌లకు కనీస మరమ్మతులు కూడా చేయకుండా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయటంతో అవి పూర్తిగా పాడుబడిపోయాయన్నారు. సమస్య పరిష్కారం కావాలంటే వెంటనే అవుట్‌ఫాల్ స్లూయిస్‌లను పునర్నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పందిస్తూ మేజర్, మైనర్ డ్రెయిన్లకు సంబంధించి అవుట్ ఫాల్ స్లూయిస్‌లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. సముద్రపు నీరు పంట పొలాల్లోకి చొరబడకుండా ఆటోమేటిక్ ఫాలింగ్ షట్టర్లతో అవుట్ ఫాల్స్ నిర్మించనున్నట్టు తెలిపారు. ఇందుకోసం రూ.36.8 కోట్లతో అంచనాలు రూపొందించామని, సాధ్యమైనంత త్వరలో అవుట్ ఫాల్ స్లూయిస్‌లను పునర్నిర్మిస్తామని తెలిపారు.

కూచిపూడి అభివృద్ధికి ఎంపీ ప్రతిపాదనను స్వాగతిస్తున్నాం

» ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా



పామర్రు : కళల వారసత్వాన్ని భారతదేశంలో నిలబెట్టేలా కూచిపూడి గ్రామాన్ని యూనెస్కో వరల్డ్ హెరిటేజ్‌గా తీర్చిదిద్దాలనే సంకల్పంతో బీజేపీ రాష్ట్ర నాయకురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి లోక్‌సభలో ప్రతిపాదన చేయడాన్ని స్వాగతిస్తున్నట్టు ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, కూచిపూడి సంస్కృతి, అభివృద్ధి సాధనకు ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో పర్యాటక శాఖ మంత్రి కందులదుర్గేష్‌తో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని గుర్తుచేశారు. కూచిపూడి అభివృద్ధికి కేంద్రప్రభుత్వం ఆర్థికంగా సహకరించాలన్న పురందేశ్వరి ప్రతిపాదన చర్చకు స్వీకరించడం శుభపరిణామమన్నారు.

బెజవాడ ఆటోనగర్‌కు కష్టమొచ్చింది!

(5వ పేజీ తరువాయి)

సంక్షేమం, వారి ఇబ్బందులు వంటి అంశాల మీదనే దృష్టి సారించ గలుగుతోంది.

నిలిచిపోయిన కొత్తతరం రాక

ఆటోనగర్‌లో పూర్వం పనిచేసిన 20 వేల మంది టెక్నీషియన్స్ పిల్లలు వారసత్వంగా ఈ వృత్తిలోకి రావటం ఆగిపోయింది. ప్రధానంగా వారి పిల్లలు ఇంజనీరింగ్, మెడిసిన్, సీఏ వంటి ఉన్నత చదువులు చదుకుని స్థిరపడిపోయారు. దీంతో వంశపారంపర్యంగా టెక్నీషియన్స్ వృద్ధి చెందలేదు. ఇది ఒక ప్రధాన కారణమైతే.. ఆటోమొబైల్ రంగంలో గత కొంత కాలంగా వస్తున్న అనూహ్య మార్పులు మరో కారణం. గతంలో లారీలకు మరమ్మతులు చేయాలంటే మెకానిక్‌ల నైపుణ్యం మీద ఉండేది. ఇప్పుడొస్తున్న ఆధునిక లారీలను బాగు చేయాలంటే మెకానిక్‌ల కష్టం కంటే కూడా స్మార్ట్ వర్క్ ఎక్కువ పాత్ర పోషిస్తోంది. హై ఎండ్ లారీలకు మరమ్మతులు చేయాలంటే ఇప్పుడు ల్యాప్‌టాప్‌లు ఉంటే సరిపోతోంది. బీఎస్-4, బీఎస్-6 వాహనాలు వచ్చాక అధునాతన లారీలకు మరమ్మతులు చేయాల్సి వస్తే పాత సంప్రదాయ మెకానిక్‌ల సామర్థ్యం సరిపోవటంలేదు. స్మార్ట్ టెక్నీషియన్స్ సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. దీంతో విజయవాడ ఆటోనగర్‌కు లారీలను తీసుకురావాల్సిన పని లేకుండా యజమాని గ్యారేజీ దగ్గరకు వారే వెళ్లి మరమ్మతులు చేసేస్తున్నారు. అలా అని సంప్రదాయ మెకానిక్‌లకు డిమాండ్ తగ్గలేదు. ఉమ్మడి కృష్ణాజిల్లానే పరిగణనలోకి తీసుకుంటే 45 వేల లారీలు ఉన్నాయి. వీటిలో 25 వేల లారీలు పెద్ద, చిన్న ట్రిప్పర్లు కాగా, మరో 20 వేల లారీలు నేషనల్ పర్మిట్స్ కలిగినవి ఉన్నాయి. వీటిలో సింహ భాగం పాతవే కావటంతో సంప్రదాయ మెకానిక్‌లపైనే ఎక్కువగా ఆధారపడి ఉన్నారు.

ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచే..

జవహర్ ఆటోనగర్ విజయవాడలో ఉండటంతో నగరంలోని ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో పెట్టుకుని చాలా మంది యజమానులు ఇటు రావటం తగ్గించేశారు. ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన లారీ యజమానులు మాత్రమే ప్రస్తుతం విజయవాడ వస్తున్నారు. ఇక్కడకు ఇతర జిల్లాల నుంచి వస్తే లారీ యజమానులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. మెకానిక్ యూనిట్స్ దగ్గర లారీలను పార్కింగ్ చేసే సదుపాయాలు లేవు. మెకానిక్‌లు తక్కువగా ఉండటం వల్ల డ్రైవర్, క్లీనర్‌లను రెండు, మూడు రోజుల పాటు ఇక్కడే ఉంచాల్సి వస్తోంది. దీంతో వీరంతా కూడా స్థానిక లాడ్జిలలో ఉండటం వల్ల వారికి రోజుకు రూ. 2 వేలు చొప్పున ఎన్ని రోజులుంటే అంత మేర ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇది యజమానులకు ఆర్థిక భారంగా మారుతోంది. దీనికి తోడు ప్రతి జిల్లాలో కూడా ఆటోనగర్ల తరహాలో పారిశ్రామికవాడలు విస్తరించటం వల్ల కూడా వారు స్థానికంగా రిపేర్లు చేయించుకోవటానికే ఆసక్తి చూపిస్తున్నారు. నెల్లూరు, కడప, అనంతపురం తదితర అనేక చోట్ల స్థానికంగా పారిశ్రామికవాడలు అభివృద్ధి చెందటం వల్ల కూడా విజయవాడ జవహర్ ఆటోనగర్‌కు లారీలు రావటం గణనీయంగా తగ్గిపోయింది.

అప్రంటీస్ విధానంతో మేలు

టెక్నీషియన్స్ కొరతను తీర్చటంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని ఏటీఏ వర్గాలు చెబుతున్నాయి. ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ మెకానిక్ విభాగాలు పూర్తి చేసిన వారికి ఆరు నెలల పాటు ఖచ్చితంగా ఆటోనగర్‌లోని మెకానిక్‌ల దగ్గర అప్రంటీస్‌గా పనిచేయించే విధానాన్ని ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు. ఒకరి దగ్గరే ఆరు నెలలు కాకుండా ఒక్కొక్కరి దగ్గర రెండు నెలల పాటు అప్రంటీస్ చేసే అవకాశాన్ని కల్పించాలని కోరుతున్నారు. దీని వల్ల చదువుకున్న మెకానిక్స్‌కు స్కిల్ డెవలప్‌మెంట్ (నైపుణ్యాభివృద్ధి) పెంపొందుతుందని అంటున్నారు. అప్రంటీస్ పూర్తయిన వారు ఉద్యోగాల కోసమే ఎదురు చూడకుండా సొంతంగా వర్క్‌షాప్‌లు పెట్టుకోవటానికి కూడా దోహదపడుతుందని చెబుతున్నారు. లేనిపక్షంలో మరో దశాబ్ద కాలంలో తమ యూనిట్స్‌ను మూసివేసుకోవాల్సి వస్తుందని అంటున్నారు.

మండల పరిషత్‌లకు 20 శాతం ఆర్థిక సంఘం నిధులు

» జాస్తి వీరాంజనేయులు వెల్లడి

బెంజిసర్కిల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : జీవో 25 ప్రకారం రాష్ట్రంలో ఉన్న 660 మండల పరిషత్‌లకు ఇక నుంచి 20 శాతం ఆర్థిక సంఘం నిధులు కేటాయిస్తారని అఖిల భారత పంచాయతీ పరిషత్(న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ సర్పంచ్‌ల సంక్షేమ సంఘం రాష్ట్ర ముఖ్యసలహాదారు జాస్తి వీరాంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు నిధుల కేటాయింపు 15 శాతంగా ఉండేదన్నారు. ఈమేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఉత్తర్వులు జారీచేశారన్నారు. కేంద్రప్రభుత్వం ప్రస్తుత జనాభా ప్రాతిపదికనే ఆర్థిక సంఘం నిధులు కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఐఐటీ మెడికల్ అకాడమీ కొనసాగించాలి

భారతీనగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల ఐఐటీ మెడికల్ అకాడమీని కొనసాగించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సాయికుమార్ అన్నారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య సమావేశం నగర నాయకుడు ఎస్.రంజిత్ అధ్యక్షతన మంగళవారం దాసరి భవన్‌లో జరిగింది. సమావేశంలో సాయికుమార్ మాట్లాడుతూ.. ఐఐటీ మెడికల్ అకాడమీ మూసివేస్తూ ఏపీ సాంఘిక సంక్షేమశాఖ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈడుపుగల్లు ఐఐటీ మెడికల్ అకాడమీని కొనసాగిస్తేనే విద్యార్థులకు మెరుగైన విద్య, భవిష్యత్ భద్రంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఐఐటీ మెడికల్ అకాడమీని కొనసాగించేలా ఉత్తర్వులు చేయాలన్నారు.

23న ఏఎన్‌యూ దూరవిద్య ఎంబీఏ, ఎంసీఏ ఉమ్మడి ప్రవేశ పరీక్ష

పెదకాకాని, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఆచార్య నాగార్జున విద్యాలయం దూరవిద్య కేంద్రం ఆధ్వర్యంలో 2025 విద్యా సంవత్సరానికిగాను రెండేళ్ల మాస్టర్ఆఫ్‌బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ), మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసీఏ) కోర్సులలో ప్రవేశ పరీక్ష షెడ్యూల్ విడుదల చేసినట్టు దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. ఈ నెల 23న రాష్ట్రవ్యాప్తంగా 7 కేంద్రాలలో ప్రవేశ పరీక్ష జరుగుతుందని చెప్పారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

(5వ పేజీ తరువాయి)

బ్యాటింగ్ ఎంచుకున్నారు. తర్వాత బ్యాటింగ్ ప్రారంభించిన మనోహర్ జట్టు మ్యాచ్‌లో విజయం సాధించింది. నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే బీవీ పార్థసారథి మధ్య సాగిన టెన్నిస్ మ్యాచ్ నువ్వానేనా అన్నట్టుగా జరిగింది. సీమ మహిళా ఎమ్మెల్యేలు ఒక జట్టుగా, కోస్తాంధ్ర మహిళా ఎమ్మెల్యేలు మరో జట్టుగా త్రోబాల్ మ్యాచ్ సాగింది. మంత్రులు అనిత, సంధ్యారాణి, కందుల దుర్గేష్, ఎం.రాంప్రసాద్‌రెడ్డి, నాదెండ్ల మనోహర్, కొండపల్లి శ్రీనివాస్, సత్యకుమార్, అచ్చెన్నాయుడు, చీఫ్‌విప్‌‌లు జీవీ ఆంజనేయులు, పంచుమర్తి అనురాధ, శాప్ చైర్మన్ రవినాయుడు పోటీల్లో పాల్గొన్నారు.

అంగరక్షకుల హడావుడి

ప్రజాప్రతినిధుల క్రీడల్లో ఉంటే వారి చుట్టుపక్కల అంగరక్షకుల హడావుడి ఎక్కువగా కనిపించింది. ప్రారంభోత్సవ సభ దగ్గర నుంచి క్రీడలు ముగిసే వరకు నానా హడావుడి చేశారు. మరోపక్క అసెంబ్లీ నుంచి వచ్చిన మార్షల్స్ హడావుడి దీనికి తోడైంది. ప్రజాప్రతినిధులంతా ఒక పక్కన కూర్చోవాలని, వారి వ్యక్తిగత సిబ్బంది మరో పక్క కూర్చోవాలని శాప్ చైర్మన్ రవినాయుడు మొదటి నుంచి మైక్‌లో చెబుతూ వచ్చారు. అయినా దీన్ని ఏమాత్రం పట్టించుకోకుండా వ్యక్తిగత సిబ్బంది, అంగరక్షకులు వ్యవహరించారు. చివరికి ఎమ్మెల్యేల క్రికెట్ మ్యాచ్ జరుగుతున్నప్పుడు ప్రాంగణం చుట్టూ ఒక వలయంగా అడ్డుగా నిలబడిపోయారు. దీనిపై మిగిలిన వాళ్లంతా అసహనం వ్యక్తం చేశారు.

వెస్ట్ బైపాస్ అత్యవసరం!

(5వ పేజీ తరువాయి)

అంశాలతో రైతులు కోర్టును ఆశ్రయించారు. దాదాపుగా డజనుకు పైగా రైతులు కోర్టులలో కేసులు వేయటంతో వాటికి స్టేలు కూడా రావటం జరిగింది. ఈ కారణంగా ప్రాజెక్టు పనులలో అయితే జాప్యం నెలకొంది.

8 నెలలు గడిచినా పూర్తికాని పనులు

నెల, రెండు నెలల్లో అయిపోవాల్సిన ప్రాజెక్టు కాస్తా ఎనిమిది నెలలు గడిచినా పూర్తి కాలేదు. ఇంకెంత కాలం పడుతుందో తెలియదు. విజయవాడ నగరం ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యలు అన్నీ, ఇన్నీ కాకుండా ఉంటున్నాయి. మరో ఏడాది గడిస్తే విజయవాడలో ఏ స్థాయిలో ట్రాఫిక్ కష్టాలు ఉంటాయో ఇప్పుడే భవిష్యత్తును చూపిస్తున్నాయి. విజయవాడ నగరం ఎదుర్కొంటున్న సత్వర ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించటానికి కొంత మేర విజయవాడ వెస్ట్ బైపాస్ ఉపయోగపడనున్నందున రాష్ట్ర ప్రభుత్వం తక్షణం రంగంలోకి దిగాల్సిన అవసరం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా న్యాయస్థానంలో ఇంప్లీడ్ కావాల్సి ఉంటుంది. విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డును జాతీయ విస్తృత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నిర్మిస్తున్నందున ఈ సమస్యను త్వరగా తేల్చాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం కూడా న్యాయస్థానంలో ఇంప్లీడ్ పిటిషన్ వేస్తే తప్ప ఈ సమస్యకు ఇప్పట్లో పరిష్కారం అయ్యేలా కనిపించటం లేదు. అలైన్‌మెంట్ వివాదాన్ని, ఎన్‌హెచ్ జరిపిన చెల్లింపుల వివాదాలను పరిష్కరించటానికి తర్వాత చర్యలు తీసుకోవటానికి అవకాశం కోరాల్సిన అవసరం ఉంది. ల్యాంకో పవర్ ప్లాంట్ వివాదం అన్నది కూడా రైతుల ఆవేదనకు అద్దం పట్టేదిగానే ఉంది. ల్యాంకో పవర్ ప్లాంట్ మూతపడిన నేపథ్యంలో, దానిని ఆక్షన్‌కు పెట్టిన సందర్భంలో ట్రాన్స్‌మిషన్ లైన్ అలైన్‌మెంట్ మార్పు అన్నదే హాస్యాస్పదంగా ఉంది. ఈ విషయం తర్వాత న్యాయస్థానం ఎలాగూ తేల్చే అవకాశం ఉంది. ఈలోపు వెస్ట్ బైపాస్ మిగిలిన పనుల పూర్తికి చర్యలు తీసుకుంటే రెండు నెలల్లో పనులు పూర్తి కావటమే కాకుండా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది.



కొత్తూరు తాడేపల్లి వెళ్లే మార్గంలో అసంపూర్తిగా నిలిచిన వెస్ట్ బైపాస్ పనులు

ఆశలు ఆవిరి!

గత ఏడాది కంటే రూ.1500 నుంచి రూ. 2 వేలు తగ్గిన మినుము ధర

- గిట్టుబాటు కాని ధరతో నష్టపోతున్న మినుము రైతులు
- పెట్టుబడి ఖర్చులు కూడా రావడంలేదని పలువురి ఆవేదన
- తీవ్రంగా నష్టపోతున్న కౌలురైతులు

(ఆంధ్రజ్యోతి-గుడివాడ రూరల్)

ప్రతీ ఏడాది వ్యవసాయ ఖర్చులు పెరుగుతుండగా, మినుము పంటకు మాత్రం గతేడాది కంటే ఈ ఏడాది వేలల్లో ధర తగ్గింది. ఎవరికీ చెప్పుకోలేక కనీసం ఖర్చులు వస్తాయో రావోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది క్వింటా మినుము ధర రూ.9వేల నుంచి రూ.10వేలవరకు పలికింది. ఈ ఏడాది రూ.7,400ల నుంచి రూ.7,800లకు తగ్గిపోయింది. గిట్టుబాటు ధర కూడా రాకపోవటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు పంట ఖర్చులు భారీగా పెరిగాయి. విత్తనాలు, దుక్కులు దున్నటానికి, కలుపు నివారణకు కూలీలు ఐదువేల వరకు ఖర్చుచేశామని, ఎకరానికి ఐదు నుంచి ఏడుసార్లు పురుగు మందులు పిచికారి చేశామని, పురుగు మందులకే రూ.18 వేలు ఖర్చు అయిందని రైతులు చెబుతున్నారు. మినుము పంట లాగటానికి కూలీలకు రూ.9 వేలు, మిషన్లతో నూర్పిడి, గాలిగుట్టలు వేయటానికి రూ.2 వేలు అవుతుందని, మొత్తం ఎకరానికి రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు ఖర్చు చేసినట్టు పేర్కొన్నారు. మినుము పంట ప్రస్తుత పరిస్థితుల్లో ఖర్చులు కూడా రాని పరిస్థితి ఉందన్నారు. రైతుకు ఎకరాకు ఆరు క్వింటాళ్లు పండిన రైతుకు మాత్రమే ఖర్చులు పోను మిగులుతుంది. గత ఏడాది కంటే ఇప్పటికీ రూ.1500 నుంచి రూ.2 వేలు ధర తగ్గటం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు చేసి పెట్టుబడి పెట్టిన రైతులు పంటను కల్లాల్లోనే అమ్ముకుంటున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణం. వరి పంట మిగల్చకపోయినా మినుము పంటకైనా ఎకరానికి రూ.25 వేలు మిగులుతుందని ఎదురుచూసిన కౌలు రైతులకు నిరాశే మిగిలింది.

> మినుము పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణం అనుకూలించినా ధర లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఖరీఫ్‌లో వరి పంట రెండు సార్లు తుపానులకు నష్టపోగా, మినుము అయినా చేతికొస్తుందని ఆశ పడగా, పంటకు గిట్టుబాటు ధరలేక ఆందోళన చెందుతున్నారు.



పొలంలో మినుము కుప్పలు

ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

- మండల వ్యవసాయాధికారిణి బోలెం అనంత లక్ష్మి



మినుము రైతులు ఆర్‌ఎస్‌కెలో పేర్లు నమోదు చేసుకోవాలి. పంట కొనుగోలుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంది. రైతులు తమ పంటను విక్రయించుకోవటానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఆర్‌ఎస్‌కేలో ఎన్ని క్వింటాళ్లు ఉన్నాయో నమోదు చేస్తే ప్రభుత్వం తరఫున కొనుగోలు చేస్తాం.

గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నాం..

- మసిముక్కు గోపాలకృష్ణ, రామన్నపూడి



గతేడాది మినుము పంట క్వింటా రూ.9 వేల నుంచి 10.500ల వరకు బయట వ్యక్తులు కొనుగోలు చేశారు. ఈ ఏడాది ధర రూ.7,450కి పడిపోయింది. సాగు ఖర్చులు విపరీతంగా పెరిగితే.. క్వింటాకు సుమారు రూ.2 వేలు ధర తగ్గింది. తీవ్రంగా నష్టపోతున్నామని అధికారులకు చెప్పినా పట్టించుకోవటం లేదు.

ఎకరాకు రూ.30 వేలు ఖర్చయింది


- గొరిపర్తి వీర్రాజు, రామన్నపూడి



సార్వాలో వరి వేసి రెండుసార్లు నష్టపోయాం. ఈ ఏడాది మినుము పంట ధరలేక పూర్తిగా నష్టపోయాం. కూలీలు, స్ప్రేయర్ల ఖర్చు చాలా పెరిగింది. ఎకరాకు మొత్తం రూ.30 వేలకుపైగా ఖర్చు అయింది. లాభం ఉండటం లేదు. ఖర్చులు పెరిగి, మినుము ధర తగ్గి తీవ్రంగా నష్టపోతున్నాం.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 114, 125
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 435

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



గన్నవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని గన్నవరం రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆవుటపల్లి మోహనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ కేవీ శివయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న డీఏ ఎరియర్స్ వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యదర్శులు దాదావల్లి సాహెబ్, నందం బసవేశ్వరరావు, కోటేశ్వరరావు, కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

నున్నలో అన్నసంతర్పణ

విజయవాడ రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రూరల్ మండలం నున్న పోలవరం కాలువ సమీపంలోని అభయాంజనేయస్వామి ఆలయ మూడవ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం శాంతిహోమం మధ్యాహ్నం మూడు వేల మంది భక్తులకు అన్న సంతర్పణ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అర్చకులు, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

గన్నవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల ఎదురుగా జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వీరపనేనిగూడెం గ్రామానికి చెందిన అవుతు శ్రీనివాసరెడ్డి(55) ద్విచక్ర వాహనంపై గన్నవరం వస్తున్నాడు. ఏలూరు నుంచి విజయవాడ వైపు వస్తున్న కారు అతి వేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసరెడ్డి ట్రాలీ ముందు పడిపోగా తలకు బలమైన గాయాలయ్యి మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మంత్రి నారా లోకేశ్‌కు ఘనస్వాగతం పలకాలి

హనుమాన్‌జంక్షన్, మార్చి18 (ఆంధ్రజ్యోతి): మల్లవల్లి ఏపీఐఐసీ పారిశ్రామికవాడలో అశోక్ లేల్యాండ్ బస్సు తయారీ పరిశ్రమను ప్రారంభించడానికి రాష్ట్ర ఐటీ మంత్రి నారా లోకేశ్ వస్తున్న సందర్భంగా నిర్వహిస్తున్న ద్విచక్ర వాహన ర్యాలీలో కార్యకర్తలు, నాయకులు, తెలుగు యువత పాల్గొని ఘనంగా స్వాగతం పలకాలని టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, జంక్షన్ పట్టణ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం సాయంత్రం జంక్షన్ బైపాస్ వేలేరు అడ్డరోడ్డు వద్ద లోకేశ్‌కు స్వాగతం పలకనున్నట్లు తెలిపారు. ద్విచక్ర వాహన ర్యాలీ వేలేరు అడ్డరోడ్డు నుంచి మల్లవల్లి ఇండస్ట్రీయల్ పార్కు వరకు సాగుతుందని మార్గమధ్యంలో జంక్షన్ అభయాంజనేయ స్వామి ఆలయ దర్శనం చేసుకుంటారని తెలిపారు.

ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం పురస్కరించుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో తారకేశ్వరరావు పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మెడికల్ షాపు యజమాని దేవభక్తుని శ్రీనివాస్, లక్ష్మీ దంపతులు భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

మానవత ఆర్థికసాయం

హనుమాన్‌జంక్షన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మెరుగైన సమాజ నిర్మాణం కోసం మానవత సంస్థ నిరంతం కృషి చేస్తోందని మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు తెలిపారు. మంగళవారం స్థానిక ఏలూరు రోడ్డులోని మానవత కార్యాలయంలో పెరికీడు గ్రామానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థిని బోడ్డుపల్లి మౌనిక కాలేజీ ఫీజులు నిమిత్తం మానవత జంక్షన్ శాఖ ఆధ్వర్యంలో రూ. 10,500లు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత నిర్వాహకులు ఘంటా సత్యనారాయణ, ఇందిరాదేవి, పాటోలు గణేష్, జేవీవీ. సత్యనారాయణ, వేగిరెడ్డి సూర్యనారాయణ, రేవిణిశెట్టి సూర్యనారాయణ, పీవీఎస్. చలం, చెక్కా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కాపు కార్పొరేషన్ లోన్స్‌కు దరఖాస్తు చేసుకోండి

కంకిపాడు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వం కార్పొరేషన్లను నిర్వీర్యం చేసిందని అఖిల భారత కాపు సమాఖ్య జిల్లా అధ్యక్షులు పచ్చిపాల రాజ అన్నారు. స్థానిక విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో కార్పొరేషన్ల ఉత్సవ విగ్రహాలుగా మార్చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే కార్పొరేషన్లకు నిధులు మంజూరు చేసిందని, అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని తెలియ జేశారు. ఈ సమావేశంలో తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు ఏనుగ జయప్రకాష్, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కరకట్టపై ఆక్రమణల తొలగింపు

ఘంటసాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం కరకట్టపై ఆక్రమణలను అధికారులు తొలగించారు. గ్రామానికి చెందిన ఓ రైతు కరకట్ట నుంచి తన పొలానికి వెళ్లేందుకు అడ్డుగా ఉన్న రెండు పూరి గుడిసెలను తొలగించాలని ఆర్‌సీ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఏఈ జనార్ధనరావు పోలీసు, రెవెన్యూ, పంచాయతీ వారి సహకారంతో ఆక్రమణలను తొలగించారు. ఆక్రమణదారులు కొద్దిసేపు గుడిసెలు తొలగించవద్దని ఆందోళన చేయగా, అధికారులు వారికి నచ్చచెప్పి వాటిని తొలగించారు.

మినుము నూర్పిళ్లు ముమ్మరం

- నిరాశాజనకంగా దిగుబడులు
- పెరిగిన పెట్టుబడి వ్యయం
- రైతుకు దక్కని గిట్టుబాటు ధర
- గతేడాదితో పోలిస్తే క్వింటాకు రూ. రెండు నుంచి మూడు వేలు నష్టం



తరిగొప్పులలో మిషన్‌సాయంతో మినుము పంట నూర్పిడి చేస్తున్న రైతు

(ఉంగుటూరు - ఆంధ్రజ్యోతి)

మండలంలో మినుము పంట నూర్పిడి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండల వ్యాప్తంగా మినుముతీత పనులు 90శాతం మేర పూర్తయ్యాయి. ఈ క్రమంలో పొలాల్లో గుట్టలుగా పోగుచేసిన మినుము కంపను రైతులు మిషన్ల సాయంతో నూర్పిడి చేస్తున్నారు. వస్తున్న దిగుబడులు, తగ్గిన ధరలను చూసి రైతులు దిగాలు చెందుతున్నారు. మండలంలో ఈ ఏడాది రెండవ(రబీ)పంటగా ఎల్‌బీజీ -752, పీయు-31, టీ-9రకాల మినుము పంటను సుమారు 22వేల ఎకరాల్లో, ఐపీఎం 2-14, విరాట్ రకాల పెసర పంటను సుమారు 2వేల ఎకరాల్లో రైతులు సాగుచేశారు. భారీ వర్షాలతో సార్వా (ఖరీఫ్) వరిపంటలో తీవ్ర నష్టాన్ని చవిచూసిన రైతు రెండవ పంటగా విత్తిన అపరాలతోనైనా అప్పులను తీర్చవచ్చునని ఆశించాడు. సాగు ఆరంభం నుంచి అపరాల (మినుము, పెసర)పైర్లపై పలు రకాల తెగుళ్లు, పురుగులు విజృంభించి, పెట్టుబడి వ్యయాన్ని విపరీతంగా పెంచాయి. ఎకరాకు 6నుంచి 8బస్తాల వరకు వస్తాయనుకున్న దిగుబడులు 3, 4బస్తాలకే పరిమితమయ్యాయి. గతేడాదితో పోలిస్తే క్వింటా (బస్తా)కు రూ2వేల నుంచి రూ.3వేల మేర ధర తగ్గటంతోపాటు పంట దిగుబడులు కూడా ఎకరాకు 2, 3 బస్తాల వరకు తగ్గి రైతుల ఆశలను ఆవిరిచేశాయి. దీంతో పెట్టుబడి ఖర్చులు కూడా రావటంలేదని రైతులు దిగాలు చెందుతున్నారు. గత ఏడాది వ్యాపారస్థులు ప్రభుత్వ మద్దతు ధర కంటే అదనంగా రెండువేల రూపాయలు చెల్లించి రైతులనుంచి అపరాలు కొనుగోలు చేశారు. ఈ ఏడాది ప్రభుత్వ మద్దతు ధర రూ.7400లుండగా వ్యాపారులు రూ.6500లకు కొనుగోలు చేస్తూ నిలువుదోపిడీ చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. మార్కెట్‌లో వ్యాపారులు సిండికేట్‌గా మారి ధర నిర్ణయించడంతో సరైన ధర దక్కటం లేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి అపరాల పంటకు తగిన మద్దతుధర కల్పించి, మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు జరపాలని రైతులు కోరుతున్నారు.



మానికొండలో మినుము గుట్టలు

చేతిపంపునకు మరమ్మతులు



హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : బండారుగూడెంలోని ఎస్సీ కాలనీలో తాగునీరందించే చేతిపంపును ఎట్టకేలకు అధికారులు మరమ్మతు చేశారు. కాలనీలో తాగునీటి ఇబ్బందిపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన 'జటిలం' కథనంతో అధికారులు దృష్టి సారించి మంగళవారం మరమ్మతులు చేయించారు. జనవరి నుంచి తాగునీటికి సమస్యగా ఉందని తెలియజేసినా అధికారులు పట్టించుకోలేదన్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఆంధ్రజ్యోతికి కోటె జయమ్మ, మాణిక్యమ్మ, వెంకాయమ్మలతో పాటు సీపీఎం నాయకుడు బర్రె లెనిన్ కృతజ్ఞతలు తెలిపారు.

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

ఉషారామా ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సుంకర అనిల్



కాగడాతో క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న ఉషారామా సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సుంకర అనిల్

ఉంగుటూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : చదువుతోపాటు క్రీడలకు విద్యార్థులు సమప్రాధాన్యత నివ్వాలని, క్రీడలలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్న విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సుంకర అనిల్ అన్నారు. స్థానిక కళాశాల 17వ వార్షిక క్రీడా మహోత్సవం మంగళవారం కళాశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సుంకర అనిల్ క్రీడాజ్యోతిని వెలిగించారు. అనంతరం శాంతి పావురాలను పైకి ఎగురవేసి వార్షిక క్రీడా మహోత్సవాన్ని ప్రారంభించారు. విద్యార్థులు జాతీయజెండా చేతబూని కళాశాల మైదానంలో మార్చ్‌ఫాస్ట్ చేస్తూ క్రీడాకారులను ఉత్సాహపరిచారు. వార్షిక క్రీడా మహోత్సవం సందర్భంగా గత 45రోజులుగా కళాశాలలో వివిధ ఆటల పోటీల్లో ప్రతిభకనబరుస్తున్న విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారి సమగ్ర అభివృద్ధిపై దృష్టి సారిస్తున్న అధ్యాపకులను ఈసందర్భంగా అనిల్ అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ తమ కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు మెరుగుపరచటంద్వారా వారి సర్వతోముఖాభివృద్ధిపై దృష్టి పెడుతున్నామన్నారు. కళాశాల ఛైర్మన్ సుంకర రామబ్రహ్మం, ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్, ఇతర అధ్యాపకులతో కలిసి విజేతలకు బహుమతులు అందజేశారు.



మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న విద్యార్థులు

వలస కార్మికుడి మృతి

హనుమాన్‌జంక్షన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : జంక్షన్ పీఎస్ పరిధిలో ఆరుగొలను వద్ద మంగళవారం తెల్లవారు జామున ప్రయాణిస్తున్న ఆటో నుంచి వలస కార్మికుడు బావవరపు మల్లేశ్వరరావు (48) జారిపడి మృతి చెందాడు. జంక్షన్ ఎస్సై లక్ష్మీన రసింహమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి జిల్లా గొలుగుంట మండలం జోగంపేట గ్రామానికి చెందిన పలువురు వ్యవసాయ కార్మికులు గుడివాడ సమీపంలోని డోకిపర్రు గ్రామంలో అపరాలతీత పనులకు కొద్ది రోజుల కిందట వలస వచ్చారు. పనులు ముగియడంతో గుడివాడ నుంచి తమ గ్రామానికి వెళ్లేందుకు ఆటోలో జంక్షన్ వైపు వస్తుండగా ఆరుగొలను సమీంలో ప్రమాద వశాత్తు జారి పడి తీవ్రగాయాలకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్య సాయం కోసం విజయవాడ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



మాట్లాడుతున్న జిల్లా ఉపాధి అధికారి దేవరపల్లి విక్టర్‌బాబు

ఉపాధి కల్పించటమే లక్ష్యం

గన్నవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉపాధి కల్పించటమే లక్ష్యమని జిల్లా ఉపాధి అధికారి దేవరపల్లి విక్టర్‌బాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నైపుణ్యాల అభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. బజాజ్ క్యాపిటల్, ఫ్లిప్‌కార్ట్, శ్రీరామ సాయి ఆఫీస్ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్ వంటి కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 28 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా 16మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి.సురేష్‌కుమార్, ప్రిన్సిపాల్ వివి కృష్ణమోహన్, తుర్లపాటి మధు, సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేను సద్వినియోగపరుచుకోండి

ఉయ్యూరు ఆర్డీవో హేలాషారోన్



మారేడుమాకలో రీ సర్వేను పరిశీలిస్తున్న ఉయ్యూరు ఆర్డీవో హేలాషారోన్

కంకిపాడు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతి ష్ఠాత్మకంగా చేపట్టిన రీ సర్వేను సద్వినియోగపరుచుకోవాలని ఉయ్యూరు ఆర్డీవో హేలా షారోన్ అన్నారు. మండలంలోని మారేడుమాకలో మంగళవారం నిర్వహించిన రీ సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత ప్రభుత్వం చేపట్టిన సర్వేతో ప్రజలు పలు ఇబ్బందులకు గురయ్యారన్న ఫిర్యాదులు రావడంతో ప్రభుత్వం రీ సర్వే చేపట్టిందన్నారు. ఈ సర్వే ప్రక్రియలో రైతులకు పూర్తి సమాచారం అందజేసి వారి సమక్షంలోనే రీ సర్వే చేపడుతున్నామని తెలియజేశారు. ప్రజలకు రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉంటారని తెలియజేశారు. ఈ రీ సర్వే ప్రక్రియను ప్రజలు సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భవన్నారాయణ, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు ఆర్ఐ ఉస్మాన్, వీఆర్వో ప్రవీణ్ పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు.. అల్లాడుతున్న ప్రజలు



ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా మారిన కంకిపాడు సెంటర్

కంకిపాడు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : పగటి ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగిపోయాయి. ఎండలు ఠారెత్తిస్తున్నాయి. మార్చి ప్రారంభంలోనే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఎండ వేడిని ప్రజలు తట్టుకోలేపోతున్నారు. ఇప్పుడే ఈ పరిస్థితి ఉంటే రానున్న ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఉదయం 10 గంటల సమయానికి ఎండ తీవ్రత అత్యధికంగా ఉండటంతో ప్రజలు బయటకు రావాలంటేనే భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా రోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు వృద్ధులు, చిన్నారులు బయటకు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ సంజయ్ సూచిస్తున్నారు. పశుపోషకులు సైతం తమ పశువులను ఎండ తీవ్రత దృష్ట్యా పశువులను మేత కు మధ్యాహ్నం 3.30 గంటల తరువాతనే తీసుకు వెళ్లాలని పశువైద్యాధికారి మాధవ్ తెలిపారు.

కూచిపూడిని వరల్డ్ హెరిటేజ్ గ్రామంగా గుర్తించాలి

మచిలీపట్నంటౌన్, మార్చి18 (ఆంధ్రజ్యోతి): నాట్యశాస్త్రంలో అంతర్జాతీయ ఖ్యాతినార్జించిన కూచిపూడిని వరల్డ్ హెరిటేజీ గ్రామంగా యునెస్కో గుర్తించాలని లోక్‌సభలో ఎంపీ పురందేశ్వరి ప్రతిపాదించడం ముదావహమని బీజేపీ నాయకులు పంతం గజేంద్ర, సోడిశెట్టి బాలాజీ, శ్రీనివాసరావు, ముడ ఛైర్మన్ మట్టా ప్రసాద్ అన్నారు. కూచిపూడిలో ప్రముఖ నాట్యాచార్యుల చరిత్రలపై పరిశోధనలు జరపాలన్నారు.

బ్యాట్‌తో కొట్టాడని కోచ్‌పై ఫిర్యాదు

ఆటోనగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : సరైన మెలుకువలతో బ్యాడ్మింటన్ ఆడట్లేదని 11 ఏళ్ల బాలిక చేయి విరిగేలా కోచ్ కొట్టిన ఘటన పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగార్జున నగర్‌లోని తాతయ్య వద్ద ఉంటున్న దేవిశ్రీ గత తొమ్మిది నెలలుగా భారతీనగర్‌లోని సాయి సందీప్ బ్యాడ్మింటన్ అకాడమీలో కోచింగ్ తీసుకుంటుంది. ఈ క్రమంలో మంగళవారం కోచింగ్‌కి వచ్చిన దేవిశ్రీ సరిగ్గా ఆడడం లేదని కోచ్ మందలించాడు. అప్పటికి ప్రదర్శనలో మార్పు రాకపోవడంతో కోపోద్రిక్తుడైనా కోచ్ బ్యాట్‌తో దేవిశ్రీ ఎడమ చేతిపై బలంగా కొట్టాడు. దీంతో పాప ఎడమ చేతికి వాపు వచ్చింది. ఇంటికి వెళ్లి తాతయ్యకు వివరించింది. ఈ విషయంపై పటమట పోలీసులకు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పవన్‌కిషోర్ తెలిపారు.

అమరజీవికి భారతరత్న ఇవ్వాలి

ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి వెంట్రప్రగడ వీరాంజనేయులు

ఉయ్యూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములకు భారతరత్న ఇవ్వాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి వెంట్రప్రగడ వీరాంజనేయులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ ఎంతో మంది కవులు, కళాకారులకు పురస్కారాలు అందచేయడం జరిగిందని, రాష్ట్ర విభజన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసిన పొట్టి శ్రీరాములకు భారత రత్న ఇవ్వాలని ఆయన కోరారు.



క్రీడోత్సాహం

విజయవాడలోని ఐజీఎం స్టేడియంలో జరిగిన ప్రజాప్రతినిధుల క్రీడా సంబరాల్లో పాల్గొన్న కృష్ణా, ఎన్టీఆర్ జిల్లా ప్రజా ప్రతినిధులు మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు కాగిత కృష్ణ ప్రసాద్, వెనిగండ్ల రాము, గద్దె రామ్మోహన్, మండలి బుద్ధప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు, బోడె ప్రసాద్, శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), తంగిరాల సౌమ్య, తదితరులు

వైభవంగా తిరుపతమ్మకు బోనాలు

పెనుగంచిప్రోలు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతమ్మ అమ్మవారి చిన్న తిరునాళ్ల మహోత్సవాలు భక్తులు సమర్పించి బోనాల సమర్పణతో వైభవంగా ముగిశాయి. ఆలయ డిప్యూటీ కమిషనర్ బీహెచ్‌వీఎస్ఎన్ కిషోర్ కుమార్, ధర్మకర్తల మండలి చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఈఈ ఎల్ రమా, సిబ్బంది ఈ బోనాలను భక్తిశ్రద్ధలతో సమర్పించగా, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. గుంటూరు జిల్లా పి రంగిపురానికి చెందిన వల్లంరెడ్డి భూశంకర్‌రెడ్డి రూ.25వేలు, కడప జిల్లా భగత్‌నగర్‌కు చెందిన చిన్ని చేతన్ అనే భక్తుడు రూ.10,108, పెనుగంచిప్రోలు మండలంలోని గుమ్మడిదుర్రుకు చెందిన కొమరగిరి నాగేశ్వరరావు రూ.5,116 విరాళాన్ని ఆలయానికి అందించారు. దాతలకు అమ్మవారు, స్వామి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందించారు.

ఆదాయం రూ.కోటి

తిరుపతమ్మ దేవస్థానం వద్ద పలు వ్యాపారాలు నిర్వహించుకునేందుకు ఆలయం వద్ద ఈవో కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో బహిరంగ వేలంపాట నిర్వహించారు. కొబ్బరికాయలు విక్రయించుకునేందుకు రూ.58.50 లక్షలు, పొంగలి షెడ్ నిర్వహణకు రూ.29.55 లక్షలు, మట్టికుండల విక్రయానికి రూ.15.50 లక్షలు మొత్తంగా రూ.1,03,55,000 ఆదాయంగా వచ్చినట్టు ఈవో కిషోర్‌కుమార్ తెలిపారు. ధర్మకర్తల మండలి చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ధర్మకర్తలు, ఈఈ రమా, కాంట్రాక్టర్లు ఎండోమెంట్ అధికారులు పాల్గొన్నారు.



బోనాలు సమర్పిస్తున్న ఆలయ ఈవో, చైర్మన్, ఈఈలు

తిరునాళ్లలో అపశ్రుతి.. ఒకరి మృతి



తిరుపతమ్మ చిన్న తిరునాళ్ల మహోత్సవాల ముగింపు రోజున మంగళవారం రాత్రి అపశ్రుతి చోటు చేసుకుంది.మంగళవారం రాత్రి తిరునాళ్లు తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున వచ్చారు. క్రాస్ జెయింట్ వీల్‌లో నిండుగా భక్తులు ఆనందంగా తిరుగుతుండగా అందులోని ఒక బాక్స్ ఊడిపోయి దూరంగా కింద పడింది. అందులో ఉన్న వత్సవాయి మండలం కొత్త రేగులగడ్డ గ్రామానికి చెందిన గింజుపల్లి సాయి మణికంఠ (25) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. అదేబాక్స్‌లో అతడి తమ్ముడు గోపీకి తీవ్ర గాయాలవడంతో అతడిని 108లో ప్రభుత్వాసుపత్రికి జగ్గయ్యపేట తరలించారు. సాయిమణికంఠ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగ్గయ్యపేట తరలించి కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఎమ్ఎస్‌కే అర్జున తెలిపారు.

23, 24, 25 తేదీల్లో పలు రైళ్ల రద్దు

రైల్వే స్టేషన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో సామర్లకోట, పిఠాపురం, గొల్లప్రోలు, రావికంపాడు, ఆటోమేటిక్ లాక్ సిగ్నలింగ్ ఏర్పాటుకు నాన్ ఇంటర్ లాకింగ్ పనులు జరుగుతుండటంతో ఈనెల 23, 24, 25 తేదీల్లో ఆ మార్గంలో పలు రైళ్లను రద్దు చేసినట్టు విజయవాడ డివిజన్ పీఆర్‌వో నుస్రత్ ఎం మండ్రూపకర్ ఒక ప్రకటనలో తెలిపారు. 17267, 17268 విశాఖపట్నం - కాకినాడ పోర్టు అప్ అండ్ డౌన్ సర్వీసులు, 67285, 67286 విశాఖపట్నం - రాజమండ్రి అప్ అండ్ డౌన్ సర్వీసులు, 22876 గుంటూరు - విశాఖపట్నం రైళ్లను ఈనెల 24న రద్దు చేశారు. 17239 గుంటూరు విశాఖపట్నం రైలును ఈనెల 23, 24వ తేదీల్లో రద్దు చేశారు. 17240 విశాఖపట్నం - గుంటూరు రైలును ఈనెల 24, 25 తేదీల్లో రద్దు చేశారు.

కొన్ని ప్రత్యేక రైళ్ల సర్వీసులు పొడిగింపు

వేసవి రద్దీని తట్టుకునేందుకు కొన్ని ప్రత్యేక రైళ్ల సర్వీసులను పొడిగించారు. ఈమేరకు సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఏ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నడిచే 07605 తిరుపతి - అకోలా రైలు ఏప్రిల్ 4 నుంచి జూన్ 27 వరకు పొడిగించారు. ఆదివారం నడిచే 07606 అకోలా - తిరుపతి రైలును ఏప్రిల్ 6 నుంచి జూన్ 29 వరకు పొడిగించారు. సోమవారం నడిచే 07609 పూర్ణా - తిరుపతి రైలును ఏప్రిల్ 7 నుంచి జూన్ 30 వరకు, మంగళవారం నడిచే 07610 తిరుపతి - పూర్ణా రైలును ఏప్రిల్ 8 నుంచి జులై 1 వరకు పొడిగించారు. సోమ, బుధ, శుక్రవారాల్లో నడిచే 07445 కాకినాడ టౌన్ - లింగంపల్లి రైలును ఏప్రిల్ 2 నుంచి జూన్ 30 వరకు, మంగళ, గురు, శనివారాల్లో నడిచే 07446 లింగంపల్లి - కాకినాడ టౌన్ రైలును ఏప్రిల్ 3 నుంచి జూలై 1 వరకు పొడిగించారు. ఆదివారం నడిచే 07481 తిరుపతి - వికారాబాద్ రైలును ఏప్రిల్ 6 నుంచి జూన్ 29 వరకు పొడిగించారు. సోమవారం నడిచే 07482 వికారాబాద్ - తిరుపతి రైలును ఏప్రిల్ 7 నుంచి జూన్ 30 వరకు పొడిగించారు. కాగా, 07481, 07482 తిరుపతి - వికారాబాద్ - తిరుపతి ఎక్స్‌ప్రెస్ చర్లపల్లి, సనత్‌నగర్, లింగంపల్లి స్టేషన్ల మీదుగా నడుస్తుంది. 07481 తిరుపతి - వికారాబాద్ రైలు ఏప్రిల్ 6 నుంచి జూన్ 29 వరకు నడుస్తుంది. ఈ రైలు తిరుపతిలో రాత్రి 7 గంటలకు బయలుదేరి, వికారాబాద్‌కు మరునాడు ఉదయం 7.10 గంటలకు చేరుకుంటుంది.



ఢిల్లీలో సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న ఎంపీ శివనాథ్

ఢిల్లీలో సీఎం చంద్రబాబుకు ఘనస్వాగతం

వన్‌టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల పర్యటన నిమిత్తం ఢిల్లీ విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఢిల్లీ విమానాశ్రయంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పార్టీ సహచర ఎంపీలతో కలిసి స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం రాత్రి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కుమార్తె వివాహ కార్యక్రమానికి హాజరు కానున్నారు.



మాజీ మంత్రి కళా వెంకట్రావుతో కలిసి డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్,

ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

- మంత్రి గొట్టిపాటి రవికుమార్
- విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం డైరీ ఆవిష్కరణ

గాంధీనగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం, వారి సంక్షేమానికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఏపీ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రూపొందించిన 2025 డైరీని సచివాలయంలోని చాంబర్‌లో మంగళవారం మాజీ మంత్రి కళా వెంకట్రావ్‌తో కలిసి మంత్రి రవికుమార్ ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు పోలాకి శ్రీనివాసరావు ఉద్యోగులు, కార్మికుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. 2022లో చేసిన పే ఫిక్సేషన్‌లో జరిగిన బేసిక్ పే సీలింగ్ ఎత్తివేయాలని కోరారు. సీలింగ్ లేని వైద్యం ఉద్యోగులకు అందించాలన్నారు. బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్రావు, ఎస్‌పీడీసీఎల్ కార్యదర్శి వైపీ సునీల్, సంఘం అసోసియేట్ అధ్యక్షుడు జి.రాము, సీపీడీసీఎల్ కే ఉమామహేశ్వరరావు, ఎన్ వీరాంజనేయులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ

సంస్థ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి

- ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ
- బీసీ ఎంప్లాయిస్ సంక్షేమ సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ

బస్టేషన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా రవాణ సంస్థలో పనిచేస్తున్న బీసీ ఉద్యోగులందరూ సమష్టిగా సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ రావు అన్నారు. మంగళవారం ఆర్టీసీ చైర్మన్ కార్యాలయంలో ప్రజా రవాణ సంస్థ బీసీ ఉద్యోగుల సంక్షేమ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్వీ శేషగిరిరావు ఆధ్వర్యంలో జరిగిన గౌరవాధ్యక్షుడు దువ్వారపు రామారావుతో కలిసి కొనకళ్ల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని, ఉద్యోగులంతా సమష్టిగా పనిచేసి సంస్థ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. దువ్వారపు రామారావు మాట్లాడుతూ కొనకళ్ల నారాయణరావు బీసీలకు ఆరాధ్యుడని, ఆయన చైర్మన్‌గా ఉండటం ఉద్యోగులకు ఒక వరమన్నారు. ఎస్వీ శేషగిరిరావు మాట్లాడుతూ బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి గతంలో ఉన్న గ్రీవియన్స్ జాయింట్ సమావేశాలను పునరుద్ధరించాలన్నారు. ఉద్యోగులపై పనిష్మెంట్లకు సంబంధించిన 2019లో జారీ చేసిన సర్క్యులర్ 1ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. ఇంటర్నేషనల్ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్వీ రావు, ప్రధాన కార్యదర్శి ఈతాకుల కృష్ణారావు, కె.ఎస్.లక్ష్మణుడు, జె.రాజా, రత్నం, ఆర్.వి.ఎస్.మన్యం, చక్రవర్తి, పి.భరణి, లింగయ్య, జానకిరామ్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు తక్షణ అనుమతులు

- కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటుచేసే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు తక్షణమే అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో మంగళవారం జిల్లా పరిశ్రమల, ఎగుమతుల ప్రోత్సాహక మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పారిశ్రామికవాడలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. సింగిల్‌విండో పద్ధతిపై పరిశ్రమల ఏర్పాటుకు తక్షణమే అనుమతులివ్వడంతోపాటు, పరిశ్రమల స్థాపనకు ఇచ్చే రాయితీలు మంజూరయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఎస్ఎంఈ సర్వేను త్వరగా పూర్తిచేయాలని మునిసిపల్ కమిషనర్లను కలెక్టర్ ఆదేశించారు. సముద్రపు నాచు పెంపకం ప్రాజెక్టును ఏర్పాటు చేస్తామని, భూమిని కొనుగోలు చేసుకుంటామని, రోడ్డు అనుసంధానం, విద్యుత్ తదితర సౌకర్యాలను కల్పించాలని కలెక్టర్‌ను పారిశ్రామికవేత్త కనకదుర్గ కోరగా స్పందించిన కలెక్టర్ మత్స్యశాఖ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరిశ్రమల విభాగం జిల్లా మేనేజర్ ఆర్ వెంకట్రావ్, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, ఎల్‌డీఎం రవీంద్రారెడ్డి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

ఓటర్ల జాబితాల తయారీకి సహకరించండి

జిల్లాలో స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీకి, అవసరమైన ప్రాంతాల్లో అదనంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు రాజకీయ పార్టీల నేతలు సహకరించాలని కలెక్టర్ బాలాజీ అన్నారు. కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం వివిధ రాజకీయపార్టీల నేతలతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఎన్నికల సమయంలోనే కాకుండా ముందస్తుగానే జాబితాలో మార్పులు, చేర్పులపై నేతల సలహాలు, సూచనలు తీసుకుంటామన్నారు. ప్రతినెలా ఇలాంటి సమావేశాలు నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించినట్టు తెలిపారు. ఎక్కడైనా బూత్‌స్థాయి అధికారులు లేకుంటే నియమిస్తామన్నారు. టీడీపీకి చెందిన దిలీప్‌కుమార్ మాట్లాడుతూ ఒకే ఇంటి నెంబరులో ఉన్న ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటుహక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఎం నేత కొడాలి శర్మ మాట్లాడుతూ టిడ్కో గృహాల్లో ఉంటున్న వారికి నూతన పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలో లోపలికి వెళ్లేందుకు, తిరిగి వచ్చేందుకు ఒకే ద్వారం ఉండటంతో పోలింగ్ ప్రక్రియ ఆలస్యమవుతోందని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. డీఆర్వో కే చంద్రశేఖరరావు, టీడీపీ, వైసీపీ, జనసేన, బీజేపీ, కాంగ్రెస్, సీపీఎం నేతలు పాల్గొన్నారు.

సారా రహిత జిల్లాగా మార్చుకుందాం

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

తిరువూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రమాదకరంగా ఉన్న కాపుసారాను సమష్టి కృషితో రూపుమాపి ఎన్టీఆర్ జిల్లాను కాపుసారా రహిత జిల్లాగా తీర్చిదిద్దుకుందామని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. మంగళవారం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో స్థానిక శ్రీవాహిని ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటుచేసిన నవోదయం 2.0ను కలెక్టర్ లాంచ్ చేశారు. తొలుత నవోదయం 2.0 ప్రచార రథాన్ని అధికారులతో కలిసి ప్రారంభించిన ఆయన తర్వాత జరిగిన సదస్సులో మాట్లాడుతూ కాపుసారా ఎన్నో అనారోగ్య సమస్యలు తెస్తుందని, కిడ్నీ వ్యాధిని సైతం ఈ మహమ్మారి గురిచేస్తుందన్నారు. 2014లో నవోదయం-1 ద్వారా కొంతమేర ఫలితం సాధించామని, ప్రస్తుతం రాష్ట్రంలో కాపుసారాను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం నవోదయం 2.0 చేపట్టిందన్నారు. తిరువూరు డివిజన్ పరిధిలో సారా తయారీ, అమ్మకాలున్నాయని, ఆయా గ్రామాలను ప్రత్యేకంగా గుర్తించినట్టు వివరించారు. డివిజన్‌లో గ్రూపు ఏలో 5 గ్రామాలున్నాయని ఈ గ్రామాల్లో కాపుసారా తయారీ, అమ్మకాలు చేస్తున్నారని, గ్రూపు బీలో సారా తయారు చేస్తున్నారని, గ్రూపు సీ గ్రామాల్లో సారా అమ్మకాలు చేస్తున్నట్టు గుర్తించామన్నారు. జిల్లాలో గ్రామ, మండలం, జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటుచేసి, సారా తయారీ, అమ్మకందారులతో చర్చించి ఆ వ్యాపారం నుంచి బయటపడేలా వారిలో చైతన్యం తేవాలన్నారు. ఇలాంటి వారికి ఇతర వృత్తులు చేసుకునేందుకు తోడ్పాటు అందిస్తామన్నారు. ఈ సదస్సులో ఆర్డీవో కె.మాధురి, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌చౌదరి, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎస్.శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ, కె.శ్రీనివాసరావు, ఎక్సైజ్ సీఐ జె.శ్రీనివాస్, సివిల్ సీఐ గిరిబాబు, తిరువూరు డివిజన్ పరిధిలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలపై ప్రత్యేక దృష్టి

కలెక్టరేట్: అర్హులకు ఇబ్బంది లేకుండా ఆర్‌వోఎఫ్ఆర్ (రికార్డ్ ఆఫ్ ఫారెస్ట్ రైట్స్) పట్టాల పంపిణీకి అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన అటవీ శాఖ సమీక్ష సమావేశం జరిగింది. ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాల పంపిణీ, హరిత విస్తీర్ణం పెంపు, ఆక్రమణల నియంత్రణపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ హరితాంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు జిల్లాలో పకడ్బందీగా అమలయ్యేలా చూడాలని, పచ్చదనం పెంచేలా వినూత్న కార్యాచరణతో అడుగులు వేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలోని వివిధ నీటి వనరుల గట్ల వెంబడి పెద్ద ఎత్తున మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో పర్యావరణానికి మేలుతో పాటు గట్లు కూడా బలంగా ఉంటాయన్నారు. జిల్లాలో అటవీ భూములు ఆక్రమణలకు గురికాకుండా పటిష్ఠ నిఘా అవసరమని, ఏవైనా ఆక్రమణలను గుర్తిస్తే అటవీ, రెవెన్యూ అధికారులతో కూడిన జాయింట్ తనిఖీల బృందాలు క్షేత్రస్థాయి తనిఖీలు చేసి, చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, డీఎఫ్‌వో జి.సతీష్, ఎఫ్ఆర్వో కె.శ్రీనివాసులు రెడ్డి, ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్ ఎ.రవీంద్రరావు, కలెక్టరేట్ ల్యాండ్ సెక్షన్ సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

రసరమ్యభరితం 'శ్రీ కృష్ణ లీలామృతం'

విజయవాడ కల్చరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): 140 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన సురభి నాటక రంగాన్ని ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో సౌత్‌జోన్ కల్చరల్ సెంటర్ తంజావూరు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో శ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత, నృత్య కళాశాలలో నిర్వహిస్తున్న 'సురభి నాటక మహోత్సవాల్లో భాగంగా 4వ రోజు సురభి డ్రామా థియేటర్ - సురభి జయానంద్ బృందం, శ్రీ బాలాజీ సురభి థియేటర్, శ్రీ వెంకటేశ్వర నాట్యమండలి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ప్రదర్శించిన 'శ్రీకృష్ణలీలలు' నాటక ప్రదర్శన ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. నాటక ప్రదర్శనలో కాళింగ మర్దనం, చిన్ని కృష్ణుని లీలలు, వసుదేవుడు శ్రీ బాల కృష్ణుడి సముద్రాలు దాటించి యశోద వద్దకు చేర్చడం, ఆకాశవాణి, అద్భుతమైన గ్రాఫిక్స్ సన్నివేశాలు, ఆహ్లాదకరమైన సంగీతంతో ప్రేక్షకులను భక్తిభావంలోకి తీసుకెళ్లింది. ఈ నాటక ప్రదర్శనలో వసుదేవుడిగా వాసుదేవరావు, యశోదగా నీరజ, శ్రీ మహావిష్ణువుగ చిన్న వెంకట్రావు, దేవేంద్రుడిగా సురభి జయానంద్, కంసుడిగా వెంకటేష్ ప్రసాద్, నారదుడిగా నిఖిలేష్, చిన్ని కృష్ణులుగా కౌశిక సాయి, స్నిగ్ధ మనోహరి నటించగా, నాగరాజు సంగీత సహకారం అందించారు.

కొత్త రుణ విధానం అమలు చేయాలి

- లోక్‌సభలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్ఎంఈలకు ఆదాయం మరింతగా వచ్చేందుకు కొత్త రుణ విధానాలను అమలు చేయాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ మంగళవారం లోక్‌సభలో ప్రస్తావించారు. విజయవాడ ఆటోనగర్‌లో పనిచేస్తున్న సుమారు లక్ష మందికి పైగా కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ఆయన ప్రస్తావించారు. దేశంలోనే అతిపెద్దదైన విజయవాడ ఆటోనగర్ 305 ఎకరాల్లో ఉందని, లక్షమందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారన్నారు. ఇక్కడ ఎంఎస్ఎంఈ సంస్థలుగా అనేకం ఉన్నాయని, ఆటో మొబైల్ పరిశ్రమలు ఎంఎస్ఎంఈలు ఆర్థిక వ్యవస్థకు కీలకంగా ఉన్నాయన్నారు. వ్యాపారాల కోసం బ్యాంకు రుణాలు పొందడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇందుకు సిబిల్ స్కోర్ అడ్డంకిగా మారిందన్నారు. వాస్తవంగా సిబిల్ స్కోర్ గతంలో తీసుకున్న రుణాల చెల్లింపుల ఆధారంగా లెక్కించబడుతుందన్నారు. కరోనా సమయంలో వ్యాపారాలు లేక రుణాలు చెల్లింపు సరిగా జరగలేదన్నారు. ఆ ప్రభావం సిబిల్ స్కోర్‌పై పడిందన్నారు. ఎంఎస్ఎంఈలకు తమ ఉత్పత్తులు అమ్మిన వెంటనే కస్టమర్ల నుంచి చెల్లింపులు జరగవన్నారు. ఇది కూడా రుణాల చెల్లింపు విషయంలో జాప్యానికి కారణమని, అందుకే సిబిల్ స్కోర్ తగ్గిపోతుందన్నారు. సిబిల్ స్కోర్ ఆధారంగా కాకుండా ఎంఎస్ఎంఈలకు వారి ఆదాయాన్ని బట్టి రుణ అర్హతను నిర్ణయించే ఆదాయ ఆధారిత రుణ అంచనా విధానాన్ని తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యను ప్రభుత్వం కూడా గుర్తించిందని, 2024-2025 కేంద్ర బడ్జెట్‌లో క్రెడిట్ స్కోర్‌పై ఆధారపడకుండా డిజిటల్ ఫుట్ ప్రింట్స్ ఆధారంగా కొత్త రుణ అంచనా విధానాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వ రంగ బ్యాంకులకు సూచించారన్నారు. దీంతో వాస్తవ ఆర్థిక స్థితిని అర్థం చేసుకుని ఎంఎస్ఎంఈలకు రుణాలు మంజూరు చేయటం సులభతరమవుతుందన్నారు.



బాలికతో అసభ్య ప్రవర్తన

- సహజీవనం చేస్తున్న మహిళ కుమార్తెపై కన్ను
- అనంతరం పురుగు మందు తాగి చికిత్స పొందుతున్న ప్రబుద్ధుడు

జి.కొండూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అభం శుభం తెలియని బాలిక పదేళ్ల నుంచి నాన్న నాన్నా అని వెంటే తిరుగుతోంది. ఆమెను కంటికి రెప్పలా కాపాడాల్సిన వ్యక్తే కన్నేశాడు. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక తల్లి పోలీసులను ఆశ్రయించడంతో అవమానభారంతో పురుగు మందు సేవించి విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన జి.కొండూరు మండలంలోని చెవుటూరులో సోమవారం జరిగింది. విజయవాడకు చెందిన ఓ మహిళకు భర్తతో పెళ్లయిన ఏడాదికే విడాకులయ్యాయి. ఇద్దరు పిల్లలతో చెవుటూరు వచ్చింది. అక్కడ ఓ వ్యక్తితో పరిచయం ఏర్పడి పదేళ్లుగా కలిసి ఉంటుంది. ఆమెకున్న బాబు, పాప అతడ్నే తండ్రి అనుకుంటున్నారు. ఆమె విజయవాడలోని ఓ షాపింగ్ మాల్లో పనిచేస్తూ సోమవారం డ్యూటీకి వెళ్లిన తరువాత ఈ ఘటన జరిగింది. పోలీసులు అతడిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు తెలిసింది.

చంద్రబాబుకు కృతజ్ఞతలు

ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు బ్రహ్మయ్య మాదిగ

గాంధీనగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు క్యాబినేట్, అసెంబ్లీలో తీర్మానం చేయడంపై ఎమ్మార్పీఎస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. 30 ఏళ్ల మాదిగల ఆశ, ఆకాంక్షలను నెరవేర్చిన సీఎం చంద్రబాబుకు మాదిగ జాతి తరపున కృతజ్ఞతలు తెలిపారు. 1994లో ఎస్సీ వర్గీకరణ చేసిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందన్నారు. గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఉరుసుపాటి బ్రహ్మయ్య మాదిగ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా చంద్రబాబు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ సమావేశాలు నిర్వహించాలని నేతలకు పిలుపునిచ్చారు. ఎస్సీలను మూడు గ్రూపులుగా విభజిస్తూ రెల్లి కులానికి 1 శాతం, మాదిగలు, ఉపకులాలకు 6.5శాతం మాలలు, ఉపకులాలకు 7.5 శాతం రిజర్వేషన్ల వర్గీకరణ ప్రక్రియ ఆమోదించాలని రాజీవ్ రంజన్ మిశ్రా నివేదికను క్యాబినేట్ ఆమోదించిందన్నారు. 21న ఎమ్మార్పీఎస్ ఉద్యమ పురిటిగడ్డ ఈదుమూడిలో అత్యవసర రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యచరణపై చర్చిస్తామన్నారు. రాష్ట్ర కో-కన్వీనర్లు మానికొండ శ్రీధర్ మాదిగ, పానుగంటి షాలెం రాజు మాదిగ పాల్గొన్నారు.

పశువైద్య విద్యార్థులకు రూ. 25వేలు ఇవ్వాలి

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయికుమార్

బెంజిసర్కిల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పశువైద్య విద్యార్థులకు నెలకు రూ.25వేలు గౌరవ వేతనం ఇవ్వాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సాయికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం విలేఖరులతో మాట్లాడుతూ గౌరవ వేతనం రూ.7వేల నుంచి రూ.25వేలకు పెంచాలని 44 రోజులుగా విద్యార్థులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం మాత్రం రూ.7వేల నుంచి రూ.10,500 పెంచుతూ ఉత్తర్వులివ్వడం సిగ్గుచేటన్నారు. ఎంబీబీఎస్, ఆయుష్ విద్యార్థులతో సమానంగా గౌరవ వేతనం ఇవ్వాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	105, 114, 125
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 435

క్రీడలతోనే మానసికోల్లాసం : ఎమ్మెల్యే

పామర్రు, మార్చి18 (ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే మానసికోల్లాసం కలుగుతుందని పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా పేర్కొన్నారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో మంగళవారం ఏపీ ఎమ్మెల్యేలకు నిర్వహించిన క్రీడా సాంస్కృతిక పోటీల్లో ఆయన సహచర ఎమ్మెల్యేలతో కలసి పాల్గొన్నారు. నేటినుంచి 20వరకు జరగనున్న ఈ పోటీల్లో పురుషులకు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ వంటి పోటీలు నిర్వహించనున్నారు. తొలిరోజు జరిగిన క్రికెట్, వాలీబాల్ ఆటలపోటీల్లో ప్రత్యర్థిజట్టుతో వర్ల ఎంతో ఉత్సాహంగా తలపడ్డారు.



క్రీడాపోటీల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా



నివాళులర్పిస్తున్న బాబ్జీ సేన నాయకులు

ప్రజా సేవే లక్ష్యం

గుడివాడ, మార్చి 18(ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అడపా బాబ్జీ తృతీయ వర్ధంతిని బాబ్జీ సేన కన్వీనర్ అద్దేపల్లి పురుషోత్తం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఏజీకే సెంటర్‌లోని అడపా బాబ్జీ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మండలి హనుమంతరావు మాట్లాడుతూ పేదలకు సాయంచేసే మంచి పనుల ద్వారానే ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాలేటి చంటి, వెంపటి సైమన్, బాబ్జీ అభిమానులు డీవీఎస్ శ్యామ్‌కుమార్, మాచిరాజు, పందిళ్ల మల్లి, యార్లగడ్డ మురళి, అడపా పండు, నల్లమోతు జగదీష్, అడపా నాగరాజు, పుచ్చకాయల సురేష్, యడ్లపల్లి బుజ్జులు, పంచకర్ల వెంకట్, కోర్నిపాటి గణపతి తదితరులు పాల్గొన్నారు.

అసాంఘికశక్తుల అడ్డా .. వెంట్రప్రగడ బస్టాండ్

● మందుబాబులతో ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు ● భయాందోళనలో మహిళలు, విద్యార్థులు

(ఆంధ్రజ్యోతి - పెదపారుపూడి) : పెదపారుపూడి మండలం వెంట్రప్రగడ గ్రామంలోని బస్టాండ్ అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. వింజనంపాడు, చెరువుకొమ్ము, పెదదళితవాడ, పులవర్తిగూడెం గ్రామాల నుంచి మహిళలు, విద్యార్థులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. బస్టాండ్‌లో ప్రయాణికులు కూర్చునేందుకు ఏర్పాటు చేసిన బెంచీలపై రాత్రి వేళల్లో మందుబాబులు మద్యం సేవిస్తున్నారు. దీనికితోడు పగటి వేళల్లోనూ ఈ బెంచీలపై మందుబాబులు పడుకునే ఉంటున్నారు. దీంతో బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులు కనీసం కూర్చునేందుకు సైతం చోటు లేని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా మహిళలు, విద్యార్థులు రాత్రి వేళల్లో బస్సులకోసం బస్టాండ్ వద్దకు రావాలంటేనే భయపడిపోతున్నారు.



పెదపారుపూడి మండలంలోని వెంట్రప్రగడ బస్టాండ్

విద్యార్థులకు రక్షణ లేదు



వెంట్రప్రగడ బస్టాండ్‌లో రాత్రీ, పగలు తేడా లేకుండా కొందరు గంజాయి, మద్యం సేవిస్తున్నారు. ప్రయాణీకులు భయపడిపోతున్నారు. మహిళలు, విద్యార్థులకు రక్షణ లేకుండాపోయింది.

కూచిపూడి సుబ్బయ్య, గ్రామస్థుడు

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారు



వెంట్రప్రగడలో నాలుగు సెంటర్ల కూడలిలో పట్టపగలే మందుబాబులు మద్యం సేవించి ట్రాఫిక్‌కి అంతరాయం కలిగిస్తున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాత్రి సమయంలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు.

సజ్జా రాధాకృష్ణ చౌదరి, వెంట్రప్రగడ

పోలీస్ కానిస్టేబుల్‌ను నియమించాలి



వెంట్రప్రగడ బస్టాండ్ వద్ద నిత్యం ప్రయాణం ఇబ్బందికరంగా ఉంది. పోలీసువారు రాత్రి, పగలు ఒక కానిస్టేబుల్‌ను తప్పనిసరిగా ఉంచాలి. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలి.

వెలగపూడి రాధాకృష్ణ

కూచిపూడిని వరల్డ్ హెరిటేజ్ గ్రామంగా గుర్తించాలి

మచిలీపట్నంటౌన్, మార్చి18 (ఆంధ్రజ్యోతి): నాట్యశాస్త్రంలో అంతర్జాతీయ ఖ్యాతినార్జించిన కూచిపూడిని వరల్డ్ హెరిటేజి గ్రామంగా యునెస్కో గుర్తించాలని లోక్‌సభలో ఎంపీ పురందేశ్వరి ప్రతిపాదించడం ముదావహమని బీజేపీ నాయకులు పంతం గజేంద్ర, సోడిశెట్టి బాలాజీ, కూనపరెడ్డి శ్రీనివాసరావు, ముడ చైర్మన్ మట్టా ప్రసాద్ అన్నారు. కూచిపూడిలో ప్రముఖ నాట్యాచార్యుల చరిత్రలపై పరిశోధనలు జరపాలన్నారు. సిద్ధేంద్రయోగి సంప్రదాయ నాట్యానికి, యక్షగాన సంప్రదాయానికి పూర్వవైభవం తీసుకుని రావాల న్నారు. కూచిపూడి నేర్చుకునే వారికి అన్ని విధాల ప్రోత్సాహకాలు అందించాలన్నారు. గ్రామంలో కూచిపూడి నాట్యానికి చెందిన శిల్పాలు, నాట్యాచార్యుల విగ్రహాలు, జీవిత చరిత్రలు పర్యాటకులకు అందించాలన్నారు.

అసంపూర్తిగా సచివాలయ నిర్మాణ పనులు

కోడూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : కోడూరు రెండో సచివాలయ నిర్మాణ పనులు అసంపూర్తిగానే నిలిపివేసి భవనాన్ని వైసీపీ పాలకులు ప్రారంభించారు. కోడూరు నరసింహపురం రోడ్డులో సంత మార్కెట్ పక్కన ఉన్న సచివాలయ భవనం ముఖద్వారం వద్ద కనీసం ప్లాస్టింగ్ చేయకుండా వదిలివేశారు. మోటార్ కూడా పని చేయటం లేదనిసచి వాలయ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సచివాలయ మరమ్మతులు చేయించి, నీటి సమస్యని పరిష్కరించాలని కోరుతున్నారు.

వాసవీ క్లబ్ కార్యవర్గం ప్రమాణస్వీకారం

పెడన, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : పెడన వాసవీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం స్థానిక వాసవీ ప్రార్థనా మందిరంలో ఘనంగా జరిగింది. క్లబ్ అధ్యక్షురాలు కొమ్మూరి విజయదుర్గ, ప్రధాన కార్యదర్శి జవ్వాజి మాధవి, కోశాధికారి తమ్మన అన్నపూర్ణ, ఉపాధ్యక్షురాలు తమ్మన లక్ష్మీతాయారు, సలహాదారు కొల్లూరి మంజులత, పిఆర్‌ఓ కొల్లూరి పద్మలత, ప్రధాన కార్యదర్శులు ఆలపాటి ధనలక్ష్మి, మామిడి సావిత్రిలచే వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వైస్‌ప్రెసిడెంట్ తాతా రజనీకుమారి, కృష్ణాజిల్లా చైర్‌పర్సన్ అన్నం సాయిసునీతలు ప్రమాణ స్వీకారం చేయించారు. కాగా వాసవీ క్లబ్ నూతన కార్యవర్గం క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న యోగేం ద్రకు రూ. 10వేల ఆర్థిక సాయం అందించింది. ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు కొల్లూరి చిన్నా పర్యవేక్షణలో ఈ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది.

పరిసరాల పరిశుభ్రతే ధ్యేయం : డీపీవో

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

పామర్రు, మార్చి18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు పంచాయతీ సిబ్బందికి సహకరించాలని జిల్లా పంచాయతీ అధికారిణి డాక్టర్ అరుణ పిలుపునిచ్చారు. 18తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన పామర్రులో పారిశుధ్యం అధ్వానం అనే శీర్షికకు సంబంధిత ఉన్నతాధికారులు స్పందించారు. మంగళవారం గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమ నిర్వహణకు (సెప్షల్‌డ్రైవ్) ఆదేశించారు. ప్రజా ఆరోగ్యానికి భంగం వాటిల్లే విధంగా పలు వార్డుల్లోని చెత్త కుండీల్లో గతవారం రోజుల నుంచి పేరుకుపోయిన చెత్తా, చెదారాలను యుద్ధప్రతిపాధికన తొలగించి బ్లీచింగ్, సున్నాలను చల్లించారు. ఈ సందర్భంగా డీపీవో అరుణ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతకు ప్రజాసహకారం తప్పనిసరిగా కావాలన్నారు. పారిశుధ్యం మెరుగుదలతో ఎవైనా సమస్యలు ఎదురైతే గ్రామస్థులు తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ప్రజలు పంచాయతీలకు చెల్లించాల్సిన నీటికుళాయి, వృత్తిపన్ను, ఇంటి పన్నుల బకాయిలు త్వరితగతిన చెల్లించి గ్రామాలభివృద్ధికి సహకరించాలన్నారు.పామర్రు నియోజకవర్గ ప్రత్యేకాధికారి బి.శివప్రసాద్ యాదవ్ ప్రజా ఆరోగ్య పరిరక్షణలో గ్రామస్థాయి అధికారులు అప్రమత్తంగా మెలగాలని ఆదేశించారు. వేసవి కాలం దృష్ట్యా ప్రజలకు తాగు నీటి ఎద్దడి సమస్యలు ఉత్పన్నం కాకుం డా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ప్రత్యేక శానిటేషన్ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అబ్దుల్‌సలీం, శానిటరీఅధికారి సుధాకర్ పాల్గొన్నారు.



శివాలయం వెనుక బజారులో క్లీన్‌అండ్‌గ్రీన్ చేస్తున్న పారిశుధ్య కార్మికులు

కరాటేలో ఉషోదయ, ఏఎన్‌ఎం విద్యార్థుల ప్రతిభ

పామర్రు, మార్చి18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే చదువుతోపాటు కరాటే శిక్షణపై మక్కువ పెంచుకోవడం ద్వారా స్వీయ రక్షణకు దోహదపడుతుందని ఉషోదయ ఇంగ్లీష్ మీడియంహైస్కూల్ ప్రిన్సిపాల్ ఎండీ రఫి అన్నారు. ఈనెల 16న జిల్లా కేంద్రమైన మచిలీపట్నం పోలీస్ పంక్షన్ హాల్లో జరిగిన ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ -25 పోటీల్లో ఆ పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి బహుమతులు సాధించారు. అండర్-14 విభాగంలో జి.హెమానాగమణికంఠ, కె.కార్తీక్, టి.ఎస్.నాయక్ బి.కౌశాల్ ఎన్.ప్రేమ్‌కుమార్‌లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. అండర్-12 విభాగంలో ఎన్.మీనా, ఎస్.సుహాసినిలు తృతీయ స్థానాల్లో నిలిచి, పతకాలు, ప్రశంసా పత్రాలను పొందారు. విజేతలైన విద్యార్థులను మంగళవారం పాఠశాల ప్రిన్సిపాల్ ఎండీ రఫి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కరాటే కోచ్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఇదేవిధంగా పామర్రు ఏఎన్‌ఎం ఇంగ్లీష్‌మీడియం హైస్కూల్ విద్యార్థులు అండర్-12 విభాగంలో విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. పి.విష్ణునాగవర్ధన్ ప్రథమస్థానం, ఎ.లోహిత్ ద్వితీయస్థానం, ప్రణయ్‌కార్తీక్, మహంతి, ఈశ్వర్, మణికంఠసాయి దేవాన్ష్, తేజేష్, మేఘహర్ష, ఝాన్సీ లక్ష్మిలు తృతీయస్థానంలో నిలిచి బంగారు,వెండిపతకాలు,ప్రశంసాపత్రాలు సంపాందించారు. విజేతలైన విద్యార్థులను ప్రిన్సిపాల్ పూర్ణచంద్రారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు శామ్యూల్ పాఠశాలలో అభినందించారు. కార్యక్రమంలో కోచ్‌రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రఫి

కూటమి పాలనలో తరలివస్తున్న ఐటీ కంపెనీలు

మచిలీపట్నం టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో ఐటీ కంపెనీలు రాష్ట్రానికి రాకుండా తరిమేశారని, కూటమి పాలనలో పెద్ద ఎత్తున ఐటీ కంపెనీలు పెట్టుబడులతో రాష్ట్రానికి తరలివస్తున్నారని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. మంగళవారం తన కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. ఏపీఐఐసీ ద్వారా విశాఖపట్నం ఐటీ పార్కులో పరిశ్రమలు స్థాపించేందుకు ప్రైవేట్ కంపెనీలు తరలి వస్తున్నాయన్నారు. 54 కంపెనీలకు 295 ఎకరాలు కేటాయించారన్నారు. కీలకమైన ఐటీ సెక్టార్ ద్వారా యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. ఫార్చ్యూన్ 2500 కంపెనీలతో లోకేష్ సంప్రదింపులు జరుపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా టీడీపీ ప్రచార కార్యదర్శి పి.వి. ఫణికుమార్ పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపులో వివాదం

మచిలీపట్నంటౌన్ : మచిలీపట్నంలో ఆక్రమణల తొలగింపులో వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆర్టీసీ కాలనీలో 2018 నుంచి కోర్టులో ఇంజక్షన్ ఉత్తర్వులు ఉన్నప్పటికీ మునిసిపల్ అధికారులు షాపును కూల్చివేశారు. దీనిపై లక్ష్మీనాగేంద్రమ్మ, ఆమె భర్త వెంకటకృష్ణారావులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోర్టు పరిధిలో ఇంజక్షన్లు ఉన్నప్పటికీ షాపులు తీయడం ఏమిటని ప్రశ్నించారు. కాగా రైతుబజార్ ఎదురుగా ఉన్న టీడీపీ దిమ్మెను తొలగించడంపై కొందరు టీడీపీ కార్యకర్తలు అసంతృప్తిని వ్యక్తం చేశారు.

యువతిని మోసం చేసిన వ్యక్తి అరెస్టు

చల్లపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రేమిస్తున్నాను, పెళ్లి చేసుకుంటానని యువతిని నమ్మించి మోసం చేసిన వ్యక్తిని చల్లపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. చల్లపల్లి మండలం పురిటిగడ్డకు చెందిన యువతిని అదే గ్రామంలో దుకాణం నడుపుతున్న మోపిదేవి మండలం కె.కొత్తపాలెం గ్రామానికి చెందిన మత్తి సోమేశ్వరరావు కుమారుడు మత్తి లీలాసతీష్ ప్రేమిస్తున్నానంటూ దగ్గరై లోబరుచుకుని పెళ్లి చేసుకోనంటూ మోసగించిన వైనంపై చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు లీలాసతీష్‌తోపాటు యువతిని బెదిరింపులకు గురిచేసిన అతని కుటుంబసభ్యులపైనా చల్లపల్లి ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేపట్టిన చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు నిందితుడు లీలాసతీష్‌ను అరెస్ట్ చేసి మంగళవారం మొవ్వ కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

కరకట్టపై ఆక్రమణల తొలగింపు

ఘంటసాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శ్రీకాకుళం కరకట్టపై ఆక్రమణలను అధికారులు తొలగించారు. గ్రామానికి చెందిన ఓ రైతు కరకట్ట నుంచి తన పొలానికి వెళ్లేందుకు అడ్డుగా ఉన్న రెండు పూరి గుడిసెలను తొలగించాలని ఆర్‌సి అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆర్‌సి ఏఈ జనార్ధనరావు పోలీసు, రెవెన్యూ, పంచాయతీ వారి సహకారంతో ఆక్రమణలను తొలగించారు. ఆక్రమణదారులు కొద్దిసేపు గుడిసెలు తొలగించవద్దని ఆందోళన చేయగా, అధికారులు వారికి నచ్చచెప్పి వాటిని తొలగించారు. ఎస్‌ఐ ప్రతాప్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాస్, వీఆర్వో గోపి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ దుకాణాలపై విజిలెన్స్ దాడులు

నాగాయలంక, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగమేశ్వరం, పాత ఉపకాలికి చెందిన 11, 36 నెంబర్ల రేషన్ దుకాణాలపై విజయవాడకు చెందిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎండీ ఉమర్ ఆధ్వర్యంలో బృంద సభ్యులు సోమవారం రాత్రి దాడులు నిర్వహించారు. షాపు నెంబర్ 11లో 56, షాపు నెంబరు 36లో 14 బ్యాగులు తక్కువగా ఉండటంతో రెండు షాపులను నిర్వహిస్తున్న డీలర్ వి.దుర్గాలక్ష్మీపై తదుపరి చర్యలు తీసుకునేందుకు పీడీఎస్ డిటి కాసింబాబుకు అప్పగించారు. సమగ్ర నివేదికలు రూపొందించి 6ఏ కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని కాసింబాబు తెలిపారు.

పుల్లేరులో గుర్రపుడెక్కను తొలగించరూ..

గుడ్లవల్లేరు, మార్చి18 (ఆంధ్రజ్యోతి): తూర్పు కృష్ణా ప్రాంతానికి తాగు, సాగు నీటికి పుల్లేరు ప్రధాన కాల్వగా ఉంది. ప్రస్తుతం ఈ పుల్లేరులో మండల పరిధిలోని మామిడికోళ్ల నుంచి మెదలుకొని, గుడ్లవల్లేరు రైల్వే బ్రిడ్జ్ దిగువన లాకుల వరకూ దట్టంగా గుర్రపుడెక్క పెరిగి దిగువకు నీటిపారుదల నిలిచిపోయింది. అంతేకాక గుడ్లవల్లేరులో నీలకంఠేశ్వరపురం వద్ద, పుల్లేరు గట్టుకు ఇరువైపులా నివాసం ఉంటున్న ప్రజలకు నీటి నుంచి దుర్వాసన వెదజల్లుతుంది. దీంతో పాటుగా దోమలు సైతం వృద్ధి చెందాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు కాల్వలో తూడు నిర్మూలించేందుకు కాంట్రాక్టు తీసుకున్న కాంట్రాక్టరు మేనెల వరకూ తూడును తొలగింపు చేయాల్సి ఉంది. మార్చిలోనే ఎండలు తీవ్రంగా వస్తున్న నేపథ్యంలో కాల్వలోని తూడు, గుర్రపుడెక్కలను తొలగిస్తే చెరువులకు తాగునీరు వచ్చినపుడు ఇబ్బంది లేకుండా నీరు అన్ని గ్రామాలకు చేరతాయి. ఈ విషయమై సంబంధిత ఇరిగేషన్ జేఈలు జి.లక్ష్మీతులసి, కె.నిర్మలను వివరణ కోరగా టెండరు ప్రకారం ఇప్పటివరకూ రెండు సార్లు కెమికల్ పద్ధతిలో, మూడుసార్లు మ్యానువల్‌గా తూడు నిర్మూలించామన్నారు. ఏప్రిల్‌నెల్లో మరోసారి తాగు నీరు విడుదల చేసేముందు తూడు, గుర్రపుడెక్కను తీయిస్తామని చెప్పారు.



పుల్లేరులో దట్టంగా పెరిగిన తూడు, గుర్రపుడెక్క

ఆలయాల జీర్ణోద్ధరణకు విరాళాలు



ఆలయాల జీర్ణోద్ధరణకు విరాళం అందజేస్తున్న ఎన్‌ఆర్‌ఐ దంపతులు

గుడ్లవల్లేరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరులో రెండో అన్నవరంగా ప్రసిద్ధి గాంచిన రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయ గోపురం జీర్ణోద్ధరణ, ఆంజనేయ స్వామి గోపుర జీర్ణోద్ధరణ, వంద సంవత్సరాకుల పైగా చరిత్ర కలిగిన గంగానమ్మ అమ్మవారి ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమాలను ఆలయ నిర్వాహకులు మంగళవారం చేపట్టారు. ఈ తరుణంలో ఆలయాల ఆధునీకరణ పనులకు పలువురు విరాళాలిచ్చి సహకరిస్తున్నారని గ్రామ మాజీ సర్పంచ్ వల్లభనేని వెంకటసుబ్బారావు చౌదరి, వల్లభనేని వెంకటరావు, ఈడ్పుగంటి ఉమామహేశ్వరరావు తదితరులు తెలిపారు. గ్రామానికి చెందిన వల్లభనేని పాండురంగారావు, కస్తూరి దంపతులు రూ. లక్ష , చాపరాల అప్పారావు జ్ఞాపకార్థం వారి కుమారులు కోళ్ల చాపరాల విజయ, సౌమ్య, కిరణ్,జ్యోతిలు రూ.లక్ష , ఎన్‌ఆర్‌ఐలు చాపరాల రాకేష్ , మౌనిక దంపతులు రూ.50,000, త్రిపురనేని శివ ప్రసాద్, శాంతిశ్రీ దంపతులు రూ.50,000, కాకాని రామారావు,భాస్కరమ్మ దంపతులు రూ.50,000 అందజేశారని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు.

తేనె పరిశ్రమ స్థాపనపై అవగాహన

తోట్లవల్లూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : తేనె పరిశ్రమకు మంచి ఆదరణ ఉందని, ఈ పరిశ్రమపై ఆసక్తి ఉన్న రైతులు ముందుకు వస్తే ఉచితంగా శిక్షణ ఇచ్చి తేనె పెట్టులు కూడా అందిస్తామని ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్(కేవీఐసీ) స్టేట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ గ్రీఫ్ తెలిపారు. తోట్లవల్లూరులో తేనె పరిశ్రమ స్థాపనపై రైతులకు ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ విజయవాడ వారి ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేనె పరిశ్రమ స్థాపించే రైతుల అభివృద్ధికి తోడ్పాటునందిస్తామన్నారు. అందుకు అవసరమైన రుణాలు పొందవచ్చునని ఆయన వివరించారు. డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ హరనాథ్ మాట్లాడుతూ ఈ ఏడాది 700 తేనె పెట్టెలను, వాటి పరికరాలను ఉచితంగా రైతులకు పంపిణీ చేశారన్నారు. లాభసాటిగా ఉండే తేనెపరిశ్రమ స్థాపనకు రైతులు ముం దుకు రావాలని కోరారు. జిల్లా ఉద్యానాధికారిణి జె జ్యో తి, అసిస్టెంట్ డైరెక్టర్ కోటిరెడ్డి, ఆర్‌ఎల్ మూర్తి, మం డల ఉద్యానాధికారిచందుజోసఫ్ సుందరం, పాల్గొన్నారు.




రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీఐసీ స్టేట్ డైరెక్టర్ గ్రీఫ్



ఆర్థిక సాయం అందజేస్తున్న జడ జానన్న

ఆర్థిక సాయం

గుడివాడ, మార్చి 18(ఆంధ్రజ్యోతి) : ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో జడ జానన్న ముందుంటారని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల సుధాకర్ అన్నారు. స్థానిక గుడ్‌మెన్‌పేటలోని జడ జానన్న ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చైర్మన్ జడ జాన్‌రాజు(జానన్న) రెండ్రోజుల క్రితం ప్రమాదంలో మృతిచెందిన పసుపులేటి నిరీక్షణ్ కుటుంబానికి రూ.10వేలు, క్యాన్సర్ బారిపడిన సహాయం కోసం ఎదురుచూస్తున్న కుటుంబసభ్యులకు ట్రస్ట్ తరుపున రూ.13,000 ఆర్థిక సాయాన్ని మంగళవారం అందజేశారు. క్యాన్సర్ బారి పడిన వ్యక్తికి రక్తం నిమిత్తం రూ.3,200లు అందజేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు కొడాలి బాలు, కాటూరి శ్రీనివాస్, కలపాల ఏసురాజు, నిరంజన్, అద్దంకి ఏబెల్, దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సిలికానాంధ్రలో రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శర్మిష్ట

వడగాడ్పులకు దూరంగా ఉండాలి

కూచిపూడి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మార్చి నెలలోనే ఎండలు విపరీతంగా పెరిగి వడగాడ్పులు వీస్తున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కృష్ణా జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ ఎం.శర్మిష్ట సూచించారు. కూచిపూడిలోని సంజీవని వైద్యాలయాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఏటా కంటే ఈ ఏడాది ఎండలు తీవ్రంగా ఉండే అవకాశాలు ఉన్నాయన్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటి వద్దనే ఉంటూ వడగాల్పులకు దూరంగా ఉండాలన్నారు. పలుచటి దుస్తులు ధరించాలని సూచించారు. వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది ప్రజలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందించాలన్నారు. చిన్నారులు, పెద్దల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సిలికానాంధ్ర ఏవో జె.హనుమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 114, 125
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 435

కూచిపూడిని వరల్డ్ హెరిటేజ గ్రామంగా గుర్తించాలి

మచిలీపట్నం టౌన్ , మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నాట్యశాస్త్రంలో అంతర్జాతీయ ఖ్యాతినార్జించిన కూచిపూడినివరల్డ్ హెరిటేజి గ్రామంగా యునెస్కో గుర్తించాలని లోక్‌సభలో ఎంపీ పురందేశ్వరి ప్రతిపాదించడం ముదావహమని బీజేపీ నాయకులు పంతం గజేంద్ర, సోడిశెట్టి బాలాజీ, కూనపరెడ్డి శ్రీనివాసరావు, ముడ చైర్మన్ మట్టా ప్రసాద్ అన్నారు. కూచిపూడిలో ప్రముఖ నాట్యాచార్యుల చరిత్రలపై పరిశోధనలు జరపాలన్నారు. సిద్ధేంద్రయోగి సంప్రదాయ నాట్యానికి, యక్షగాన సంప్రదాయానికి పూర్వవైభవం తీసుకుని రావాలన్నారు. కూచిపూడి నేర్చుకునే వారికి అన్ని విధాల ప్రోత్సాహకాలు అందించాలన్నారు. గ్రామంలో కూచిపూడి నాట్యానికి చెందిన శిల్పాలు, నాట్యాచార్యుల విగ్రహాలు, జీవిత చరిత్రలు పర్యాటకులకు అందించాలన్నారు.



రామాలయంలో హనుమాన్ చాలీసా పారాయణం

అవనిగడ్డ రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ మండల పరిధి లోని అశ్వారావుపాలెంలో శ్రీకోదండ రామాలయంలో ప్రతి రోజూ 108సార్లు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళ వారం హనుమాన్ చాలీసా పరాయణం చేశారు. మంగళవారం పంద్రాజు శివనాగ రాజు దంపతులు పూజలు చేశారు.

రంగనాయకస్వామి ఆలయ ఈవోగా సత్యప్రసాద్‌బాబు

మచిలీపట్నం టౌన్: మచిలీపట్నం రంగనాయక స్వామి ఈవోగా ఎం. సత్య ప్రసాద్‌బాబు విజయవాడ నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఈవోగా ఉన్న గోపాలరావు తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

శక్తితో మహిళలపై వేధింపులకు చెక్

జెండా ఊపి అవగాహన ర్యాలీని ప్రారంభించిన ఎస్పీ గంగాధరరావు



శక్తిటీమ్ వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎస్పీ గంగాధరరావు

మచిలీపట్నం టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మహిళల లైంగిక వేధింపులను శక్తిటీమ్‌ల ద్వారా అరిక ట్టాలని ఎస్పీ ఆర్.గంగాధరరావు అన్నారు. మంగళ వారం జిల్లా వ్యాప్తంగా 40 మంది సిబ్బందితో 20 శక్తి టీమ్ బృందాలను ఎస్పీ ఏర్పాటు చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన శక్తి టీమ్‌ల వాహనాలను తన కార్యాలయం వద్ద జెండా ఊపి అవగాహన ర్యాలీని ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళల వేధింపులపైనే కాకుండా బహిరంగ మద్యపానం, మాదకద్రవ్యాల వినియోగం, చీకటిప్రాంతాల్లో అసాంఘిక కార్యకలా పాలు, ఈవ్‌టీజింగ్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విధుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించి మహిళలకు మేమున్నామంటూ భరోసా ఇవ్వాలన్నారు. పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ (అడ్మిన్) వి.వి. నాయుడు, ఏఆర్ ఎస్పీ బి. సత్యనారాయణ, మహిళా పోలీసు స్టేషన్ సీఐ వెంకటేశ్వరరావు, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు రాఘవయ్య, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో పాదచారుల దాహార్తిని తీరుస్తాం ..

వేసవిలో పాదచారుల దాహార్తిని తీర్చేందుకు లక్ష్మీటాకీసు సెంటర్‌లో చలివేంద్రం ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు అన్నారు. మంగళ వారం ఐక్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మచిలీపట్నం ట్రాఫిక్ పోలీసు సహకారంతో లక్ష్మీటాకీసు సెంటర్‌లోని పోలీసు పెట్రోలు బంకు వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని ఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. మధ్యాహ్నం పూట వృద్ధులు, పిల్లలు ప్రయాణం చేయడం మంచిది కాదన్నారు. వడగాలులు వీచే సమయంలో వైద్యుల సూచనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ శివకుమార్, చిలకలపూడి సీఐ నబీ, ఎస్ఐలు వెంకటేశ్వరరావు, మధుసూదనరావు పాల్గొన్నారు.



సంపద కేంద్రంలో వర్మీ ఎరువును పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

తడి చెత్తతో వర్మి కంపోస్టు తయారు చేయాలి

చిట్టిపాలెం సంపద కేంద్రంలో కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో నిర్మించిన సంపద ఉత్పత్తి కేంద్రాల్లో తడిచెత్తతో ఎరువులు తయారు చేసి రైతులు వినియోగించుకోవచ్చని కలెక్టర్ బాలాజీ సూచించారు. బందరు మండలం చిట్టిపాలెం గ్రామంలోని సంపద ఉత్పత్తి కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. పొడిచెత్త నుంచి తడిచెత్తను ఎలా విడదీయాలో చూపించారు. ఇంటి యజమానుల నుంచి తడిచెత్తను ఎలా స్వీకరించి సంపద తయారీ కేంద్రానికి పంపవచ్చో వివరించాలన్నారు. ఎంపీడీవో వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి సుకుమార్, ఈవోఆర్‌డి బాలకృష్ణ పాల్గొన్నారు.



హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

అద్దంకి నాంచారమ్మ జాతర ఆదాయం రూ.13.96 లక్షలు

కోడూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): విశ్వనాథపల్లిలో అద్దంకి నాంచారమ్మ జాతర ఆదాయం రూ.13,96,300 వచ్చినట్లు ఆలయ ఈవో జయశ్రీ మంగళవారం తెలిపారు. ఈ నెల 13, 14తేదీల్లో జరిగిన జాతరలో భక్తులు హుండీల్లో వేసిన కానుకలు, లడ్డూ పాటలు, కొబ్బరి చిప్పలు, పాల పొంగళ్లు, తలనీలాలు, వీఐపీ దర్శనాలు, పది రూపాయల దర్శనాలు తదితర కానుకల రూపంలో వచ్చిన ఆదాయాన్ని దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారి ఆధ్వర్యంలో లెక్కించినట్లు తెలిపారు. గతేడాది కన్నా ఈ ఏడాది రూ.1,86,029లు ఆదాయం తక్కువ వచ్చినట్లు ఈవో తెలిపారు.

ఫరీద్‌బాబా దర్గాలో ఘనంగా వేడుకలు

మచిలీపట్నంటౌన్: కరగ్రహారం ఫరీద్ బాబా దర్గాలో రెండో రోజు పెద్ద ఎత్తున వేడుకలు జరిగాయి. ఊరేగింపు జరిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మతో పాటు డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమం జరిగింది.



సమ్మేళనంలో పాల్గొన్న కవులు

కవితాభిమానులను అలరించిన ఉగాది కవి సమ్మేళనం

అవనిగడ్డ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): శ్రీవిశ్వావసు నామ ఉగాదిని పురస్కరించుకుని మంగళ వారం అవనిగడ్డ డిగ్రీ కళాశాలలో దివిసీమ కవులతో విజయవాడ ఆకాశవాణి వారి సౌజన్యంతో ముందస్తుగా నిర్వహించిన ధ్వని ముద్రణ ఉగాది కవి సమ్మేళనం వీక్షకులను, కవితాభిమానులను ఉర్రూతలూగించింది. దివిసీమ సాహితీ సమితి, తెలుగు సావిడి, భారతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి గుడిసేవ విష్ణు ప్రసాద్ అధ్యక్షత వహించి కవితా గానం చేశారు. ఆకాశ వాణి సంచాలకులు బి.వెంకటేశ్వర్లు, ప్రయోక్త చుండూరు మాణిక్యాల రావు పర్యవేక్షించారు. ఈ కవుల సమ్మేళనంలో ప్రముఖ కవులు, అవధాని డా.పాలపర్తి శ్యామలా నంద ప్రసాద్, పూషడపు సుబ్బారావు, బి.సుహితా భారతి, డా.డి.ఉమారాణి, జి.సూర్యనారాయణ, నాయుడు బసవ కామేశ్వరి, సింహాద్రి పద్మ, వంగర శేషగిరిరావు, చన్నగిరి లతామోహన్, నడ కుదుటి రాధాకృష్ణమూర్తి, దీవి ఝాన్సీ, సూరగం రామకృష్ణలు తమ ఉగాది కవితితలను రాగ యుక్తంగా, భావభరితంవగా చదివి వినిపించారు.ఈ కార్యక్రమంలో నవజీవన్ విద్యాసంస్థలు అధి నేత కొండవీటి ఈశ్వరరావుతోపాటు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఈ నెల 30న ఉగాది రోజున విజయవాడ ఆకాశవాణి కేంద్రం నుంచి ప్రసారం కానుంది.

చిలకలపూడిలో పొలం పిలుస్తోంది

ఘంటసాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిలకలపూడి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి కె.మురళీకృష్ణ మాట్లాడుతూ ఘంటసాల మండలంలో రబీ 2024-25 పంటకాలంలో 18508 ఎకరాల్లో సాగు చేసిన పంటల వివరాలు ఈ-పంటలో నమోదు చేసినట్లు తెలిపారు. మినుము క్వింటాలుకు మద్దతు ధర రూ.7400 కాగా, పెసలు మద్దతు ధర క్వింటాలు రూ.8682లు బహిరంగ మార్కెట్‌లో కనీస మద్దతు ధర కన్నా తక్కువ ధర ఉన్న సందర్భంలో ఈ-పంటలో నమోదు చేసుకుని ఈ-కేవైసీ పూర్తి చేసిన రైతుల నుంచి మద్దతు ధరలకు మినుము, పెసలు కొనుగోలు చేస్తామన్నారు. రైతులు సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకుడిని సంప్రదించి సీఎం యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏఏ బి.దిలీప్, రైతులు పాల్గొన్నారు.

మామిడిలో విలువ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణ

అవనిగడ్డ: అవనిగడ్డ శివారు బందలాయిచెరువులో మామిడిలో విలువ ఆధారిత ఉత్పత్తులపై మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డా.సుధారాణి మామిడి తాండ్ర, మామిడితో ఉత్పత్తులు, జ్యూస్ తయారీ తెలిపారు. శాస్త్రవేత్తలు జి.కృష్ణవేణి, రేవతి, యశ్వంత్, పలువురు మహిళలు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తల బృందం

పంటల్లో సస్యరక్షణపై అవగాహన

మోపిదేవి: వ్యవసాయ పంటల్లో చేపట్టాల్సిన సస్య రక్షణపై ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. మంగళవారం మోపిదేవి పంచాయతీ శివారు రావివారిపాలెం వద్ద బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులచే ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డా.డి.సుధారాణి, శాస్త్రవేత్త రేవతిలు మట్టి నమూనాల సేకరణ, నీ మాస్త్రం తయారీ, పంటలపై పిచికారి తదితర విషయాలను వివరించారు.

బీఐఎస్ మార్కు వస్తువులనే కొనుగోలు చేయాలి

ఘంటసాల: బీఐఎస్(భారతీయ ప్రమాణాల బ్యూరో) ధ్రువీకరించిన వస్తువులను మాత్రమే కొనుగోలు చేయాలని సంస్థ రిసోర్స్ పర్సన్ జొన్నలగడ్డ రవికుమార్ అన్నారు. అధికారులు, విద్యార్థులు, వ్యాపార వర్గాలను కలసి మంగళవారం బ్రోచర్లు అందజేసి అవగాహన కల్పించారు. నాణ్యమైన వస్తువు లపై బీఐఎస్ మార్క్ తప్పనిసరిగా ఉంటుందన్నారు.



క్యాన్సర్ వైద్య నిపుణుడు దినేష్‌రెడ్డిని సత్కరిస్తున్న కేయూ ఉపకులపతి రాంజీ తదితరులు

తొలిదశలో గుర్తిస్తే క్యాన్సర్ నివారణ సులభతరం

వైద్య నిపుణుడు దినేష్‌రెడ్డి

మచిలీపట్నం టౌన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి) : తొలిదశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే సులభంగా నివారించవచ్చని మణిపాల్ ఆసుపత్రి క్యాన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ దినేష్‌రెడ్డి అన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో క్యాన్సర్ నివారణపై అవగాహన సదస్సు జరిగింది. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆహారపు అలవాట్ల వల్ల రోగాలు పెరిగే అవకాశం ఎక్కువవుతున్నాయన్నారు. ఎక్కువగా రెస్టారెంట్లలో ఆహారం తీసుకోవడం ప్రమాదకరమన్నారు. వైద్యరంగంలో చోటు చేసుకుంటున్న విప్లవాత్మకమైన మార్పుల వల్ల క్యాన్సర్ వంటి రోగాలను నయం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి కె.రాంజీ, రెక్టార్ బసవేశ్వర రావు, రిజిస్ట్రార్ ఎన్. ఉష, ఎన్ఎస్ఎస్ విభాగం సమన్వయకర్త డాక్టర్ ఎం. శ్రావణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు శేషారెడ్డి, స్వరూప, రవి, శాంతి కృప, సిహెచ్. గోపీ మాట్లాడారు.

మర్యాదపూర్వక కలయిక

అవనిగడ్డ: ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావును అవనిగడ్డ నియోజకవర్గ టీడీపీనేత, ఎన్ఆర్ఐ పారిశ్రామికవేత్త బొబ్బా గోవర్ధన్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలసి అవనిగడ్డ నియో జకవర్గ సమస్యలు వివరించారు. మంగళవారం కొనకళ్ల నారాయణరావును విజయవాడలోని చైర్మన్ కార్యాలయంలో కలిసి రాత్రి సమయాల్లో అవనిగడ్డ నుంచి నాగాయలంక, కోడూరు మండలాలకు రాత్రి 10.30కు, 11 సమయంలో విజయవాడ నుంచి వచ్చే బస్సులను నాగాయలంక రూట్‌కు ఒకటి, కోడూరు రూట్‌కు ఒకటి పొడిగించాలని గోవర్ధన్ కోరారు. అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటానని చైర్మన్ కొనకళ్ల నారాయణరావు హామీ ఇచ్చారని గోవర్ధన్ తెలిపారు.

ఎస్టీలకు కూటమి ప్రభుత్వం అండ

కోడూరు: కూటమి ప్రభుత్వం ఎస్టీ కాలనీల్లో నూతన రహదారులు నిర్మించి, నూతనగృహాల నిర్మాణానికి అవకాశాలు కల్పించి ఎస్టీలకు అండగా నిలుస్తుందని జనసేన ఎస్టీ నాయకులు, యానాది మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా విజయబాబు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఉల్లిపాలెం, హరిపురం, శ్రీరాంపురం గ్రామాల్లో పర్యటించారు. కార్యక్రమంలో జనసేన ఎస్టీ నాయకులు మంగళగిరి శ్రీనివాస్, కోనేటి అంకాలు, కోనేటి నాంచారయ్య, ఉప్పలపాటి బుల్లెమ్మ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నం 41వ డివిజన్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న గురివిందల పైడితల్లికి మంగళవారం సీఎం సహాయనిధి కింద రూ. 43,911ల చెక్కును మచిలీపట్నం నగర టీడీపీ అధ్యక్షుడు ఎండీ ఇలియాస్ బాషా అందజేశారు. కిల్లాని అచ్చయ్య నాయుడు, వాకమల్లు శ్రీనివాసరావు, పిన్నింటి నాగ అయ్యప్ప, వీరాపు రామ కృష్ణ, గురివిందపల్లి జ్యోతి ప్రకాష్, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా సచివాలయ నిర్మాణ పనులు

కోడూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : కోడూరు రెండో సచివాలయ నిర్మాణ పనులు అసంపూర్తిగానే నిలిపివేసి భవనాన్ని వైసీపీ పాలకులు ప్రారంభించారు. కోడూరు నరసింహాపురం రోడ్డులో సంత మార్కెట్ పక్కన ఉన్న సచివాలయ భవనం ముఖద్వారం వద్ద కనీసం ప్లాస్టింగ్ చేయకుండా వదిలివేశారు. మోటార్ కూడా పని చేయటం లేదనిసచివాలయ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సచివాలయ మరమ్మతులు చేయించి, నీటి సమస్యని పరిష్కరించాలని కోరుతున్నారు.

కూటమి పాలనలో తరలివస్తున్న ఐటీ కంపెనీలు

మచిలీపట్నం టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో ఐటీ కంపెనీలు రాష్ట్రానికి రాకుండా తరిమేశారని, కూటమి పాలనలో పెద్ద ఎత్తున ఐటీ కంపెనీలు పెట్టుబడులతో రాష్ట్రానికి తరలివస్తున్నారని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. మంగళవారం తన కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. ఏపీఐఐసీ ద్వారా విశాఖపట్నం ఐటీ పార్కులో పరిశ్రమలు స్థాపించేందుకు ప్రైవేట్ కంపెనీలు తరలి వస్తున్నాయన్నారు. 54 కంపెనీలకు 295 ఎకరాలు కేటాయించారన్నారు. కీలకమైన ఐటీ సెక్టార్ ద్వారా యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. ఫార్చ్యూన్ 2500 కంపెనీలతో లోకేష్ సంప్రదింపులు జరుపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా టీడీపీ ప్రచార కార్యదర్శి పి.వి. ఫణికుమార్ పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ కార్యవర్గ ప్రమాణస్వీకారం

పెడన, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : పెడన వాసవీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం స్థానిక వాసవీ ప్రార్థనా మందిరంలో ఘనంగా జరిగింది. క్లబ్ అధ్యక్షురాలు కొమ్మూరి విజయదుర్గ, ప్రధాన కార్యదర్శి జవ్వాజి మాధవి, కోశాధికారి తమ్మన అన్నపూర్ణ, ఉపాధ్యక్షురాలు తమ్మన లక్ష్మీతాయారు, సలహాదారు కొల్లూరి మంజులత, పీఆర్‌ఓ కొల్లూరి పద్మలత, ప్రధాన కార్యదర్శులు ఆలపాటి ధనలక్ష్మి, మామిడి సావిత్రిలచే వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వైస్‌ప్రెసిడెంట్ తాతా రజనీకుమారి, కృష్ణాజిల్లా చైర్‌పర్సన్ అన్నం సాయిసునీతలు ప్రమాణ స్వీకారం చేయించారు. కాగా వాసవీ క్లబ్ నూతన కార్యవర్గం క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న యోగేంద్రకు రూ. 10వేల ఆర్థిక సాయం అందించింది. ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు కొల్లూరి చిన్నా పర్యవేక్షణలో ఈ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది.

బందరుకోటను సందర్శించిన జపాన్ దేశస్తురాలు



మచిలీపట్నం టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక బందరుకోటను మంగళవారం జపాన్ దేశస్తురాలు పూమి సందర్శించి ముగ్ధులయ్యారు. ఇంటాక్ కన్వీనర్ డాక్టర్ ఉడత్తు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బందరుకోటలోని గంటస్తంభం, మందుగుండు నిల్వలు ఉండే గిడ్డంగి, తుపాను తాకిడికి గురైన ప్రాంతాలు, డచ్‌వారి సమాధులు, డచ్‌వారు నిర్మించిన జైళ్లను సందర్శించారు. వీటి చారిత్రక అంశాలను శ్రీనివాసరావు వివరించారు. ఈ కార్యక్రమంలో జపాన్ దేశస్తురాలు పూమితో పాటు ఉత్తరప్రదేశ్‌కు చెందినజూహి, పంజాబ్‌కు చెందిన మదన్‌మీనా తదితరులు పాల్గొన్నారు.

యువతిని మోసం చేసిన వ్యక్తి అరెస్టు

చల్లపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రేమిస్తున్నాను, పెళ్లి చేసుకుంటానని యువతిని నమ్మించి మోసం చేసిన వ్యక్తిని చల్లపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. చల్లపల్లి మండలం పురిటిగడ్డకు చెందిన యువతిని అదే గ్రామంలో దుకాణం నడుపుతున్న మోపిదేవి మండలం కె.కొత్తపాలెం గ్రామానికి చెందిన మత్తి సోమేశ్వరరావు కుమారుడు మత్తి లీలాసతీష్ ప్రేమిస్తున్నానంటూ దగ్గరై లోబరుచుకుని పెళ్లి చేసుకోనంటూ మోసగించిన వైనంపై చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు లీలాసతీష్‌తోపాటు యువతిని బెదిరింపులకు గురిచేసిన అతని కుటుంబసభ్యులపైనా చల్లపల్లి ఎస్ఐ సుబ్రహ్మణ్యం కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేపట్టిన చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు నిందితుడు లీలాసతీష్‌ను అరెస్ట్ చేసి మంగళవారం మొవ్వ కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

కరకట్టపై ఆక్రమణల తొలగింపు

ఘంటసాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శ్రీకాకుళం కరకట్టపై ఆక్రమణలను అధికారులు తొలగించారు. గ్రామానికి చెందిన ఓ రైతు కరకట్ట నుంచి తన పొలానికి వెళ్లేందుకు అడ్డుగా ఉన్న రెండు పూరి గుడిసెలను తొలగించాలని ఆర్‌సి అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆర్‌సి ఏఈ జనార్ధనరావు పోలీసు, రెవెన్యూ, పంచాయతీ వారి సహకారంతో ఆక్రమణలను తొలగించారు. ఆక్రమణదారులు కొద్దిసేపు గుడిసెలు తొలగించవద్దని ఆందోళన చేయగా, అధికారులు వారికి నచ్చచెప్పి వాటిని తొలగించారు. ఎస్ఐ ప్రతాప్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాస్, వీఆర్వో గోపి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ దుకాణాలపై విజిలెన్స్ దాడులు

నాగాయలంక, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగమేశ్వరం, పాత ఉపకాలికి చెందిన 11, 36 నెంబర్ల రేషన్ దుకాణాలపై విజయవాడకు చెందిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎండీ ఉమర్ ఆధ్వర్యంలో బృంద సభ్యులు సోమవారం రాత్రి దాడులు నిర్వహించారు. షాపు నెంబర్ 11లో 56, షాపు నెంబరు 36లో 14 బ్యాగులు తక్కువగా ఉండటంతో రెండు షాపులను నిర్వహిస్తున్న డీలర్ వి.దుర్గాలక్ష్మీపై తదుపరి చర్యలు తీసుకునేందుకు పీడీఎస్ డిటి కాసింబాబుకు అప్పగించారు. సమగ్ర నివేదికలు రూపొందించి 6ఏ కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని కాసింబాబు తెలిపారు.

ఆక్రమణల తొలగింపులో వివాదం

మచిలీపట్నం టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నంలో ఆక్రమణల తొలగింపులో వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆర్టీసీ కాలనీలో 2018 నుంచి కోర్టులో ఇంజక్షన్ ఉత్తర్వులు ఉన్నప్పటికీ మునిసిపల్ అధికారులు షాపును కూల్చివేశారు. దీనిపై లక్ష్మీనాగేంద్రమ్మ, ఆమె భర్త వెంకటకృష్ణారావులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోర్టు పరిధిలో ఇంజక్షన్లు ఉన్నప్పటికీ షాపులు తీయడం ఏమిటని ప్రశ్నించారు. కాగా రైతుబజార్ ఎదురుగా ఉన్న టీడీపీ దిమ్మెను తొలగించడంపై కొందరు టీడీపీ కార్యకర్తలు అసంతృప్తిని వ్యక్తం చేశారు.